www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్   సంపుటి : 16   సంచిక : 27   గురువారం, జూన్ 11, 2026, పేజీలు - 12   వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400




## పుష్కర కాలంలో అనేక మార్పులు
# తీసుకుని వచ్చాం



- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపాం
- 12 ఏళ్లుగా కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వస్తున్నాం
- కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...వేలకోట్ల కుంభకోణాలు
- 2014కు ముందు..ఇప్పుడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం
- 12 ఏళ్లు ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ ప్రసంగం

**న్యూఢిల్లీ,జూన్ 10 :** కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు.

మిగతా2లో...

## ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే
# బండకేసి కొడతారు

- టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ

- ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకోవడమే బిజెపి, బిఆర్ఎస్ పని
- కడుపులో విషం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారు
- నాలాల కబ్జాలతో హైదరాబాద్ మునిగి పోతోంది
- కబ్జాదారుల కోరలు పీకేందుకే హైడ్రా ఏర్పాటు
- బతుకమ్మకుంటను ఎడ్లకు రాసిచ్చిన కెసిఆర్
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,జూన్ 10 :** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని మిగతా2లో...

## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

- పాదచారులకు ఇబ్బంది కలిగించడంపై హైకోర్టు ఆగ్రహం


2లో

# జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

- అక్కడికి రావద్దంటే..మీ జాగీరా అనడంలో తప్పేముంది
- ఉత్తర,దక్షిణది విభేదాలు దేశానికి ప్రమాదకరం
- మీడియాతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**న్యూఢిల్లీ,జూన్ 10 :** జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం

మిగతా2లో...

## ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

- 'ఫార్మా హబ్' ఏర్పాటుకు పూర్తిస్థాయి సహకారం
- ఘనా ఉన్నత స్థాయి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,జూన్ 10 :** రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని

మిగతా2లో...

## 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి

- జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాల పూర్తి
- సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్ల సిద్ధం
- నవంబర్-డిసెంబర్‌లో పునరుద్ధరణ పనుల ప్రారంభం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**మేడిగడ్డ,జూన్ 10 :** మెడిగడ్డ బ్యారేజ్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మెడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగు తున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు మరియు

మిగతా2లో...



## పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

- గిరిజన హక్కుల పరిరక్షణకు చట్టం కీలకం
- పీసా చట్టంపై వర్క్‌షాపు ప్రారంభించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూన్ 10 :** పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను

మిగతా2లో...

## ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

### అత్యధిక కాలం ప్రధానిగా నెహ్రూ రికార్డు బ్రేక్

### మీనాక్షి వ్యవహారం ఎన్నికల సంఘం పరిధిలోనిదన్న బండి



**కరీంనగర్,జూన్ 10 :** భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కువ కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును నరేంద్ర మోదీ బ్రేక్ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం

మిగతా2లో...

## ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి

- మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము


2లో

# పుష్కర కాలంలో అనేక మార్పులు తీసుకుని వచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు.తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాముల య్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు.సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తెలిపోయిందని అన్నారు. దేశంలో మావోలను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్- 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు.

# జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద

(మొదటి పేజీ తరువాయి)

జనసేనకు ఉందని ప్రస్తావించారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పనిచేయొద్దా? అని ప్రశ్నించారు. కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇకపోతే ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని, అలా విభజన రేఖ గీయకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ భావన పెరిగితే దేశానికి ప్రమాదకరమని చెప్పారు. సమస్యలుంటే ఎక్కడైనా వాటిపై మాట్లాడొచ్చన్నారు. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని హితవు పలికారు. విభజనవాదం దేశానికి మంచిది కాదు. 570కి పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తే దేశం ఇలా ఉంది. నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు. అలా అయితే, రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాలు మారాలని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదని యువత కోరుకుంటోంది. చెప్పే మాటల్లో అర్థం, హేతుబద్ధత ఉండే నాయకులే యువతకు కావాలి. తమ సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నా. అక్కడ పోటీ చేయాలని మా పార్టీ నేతలు కోరారు. నేనెప్పుడు, ఎక్కడికి వెళ్లాలో ఇతర వ్యక్తులు చెప్పలేరు. ఈ దేశం నాది.. ఎక్కడికైనా వెళ్లవచ్చనే ఉద్దేశంతోనే జాగీర్ అనే పదం వాడా. రాష్ట్ర విభజనకు నేనెప్పుడూ వ్యతిరేకం కాదు.. చేసిన తీరునే వ్యతిరేకించా'అని పవన్ తెలిపారు.వీబీ-జీ రామ్ జీ పథకం కింద ఏపీకి కేంద్రం రూ.7,707.21 కోట్లు కేటాయించడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే మూడో అత్యధిక కేటాయింపును ఏపీ దక్కించుకుంద న్నారు. ఉపాధి పనుల్లో పారదర్శకతతో పాటు సమర్థ వంతమైన నిర్వహణకు ఇది నిదర్శనంగా అభివర్ణిం చారు. కేంద్రం ఇస్తున్న నిధులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తాయని, ప్రజల జీవనో పాధిని మెరుగుపరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే బండకేసి కొడతారు

(మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చా రు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చ రించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరా బాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.

# 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థలకు పంపుతామని తెలిపారు. వాటి సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామని చెప్పారు. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి 2027 వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైడ్రాలజికల్ అధ్యయనాలతో పాటు జియోటెక్నికల్ బోర్‌హోల్ పరిశోధనలు, ఇతర సాంకేతిక పరీక్షలను వేగవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో ఉఖఖీ పరీక్షలు 90 శాతం వరకు పూర్తయ్యాయని, బోర్‌హోల్ మరియు జియోటెక్నికల్ పరిశోధనలు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. జూన్ చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలకుల తప్పుడు నిర్ణయాలు, లోపభూయిష్ట విధానాలు, నిర్మాణ లోపాల కారణంగానే మెడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2023 అక్టోబర్‌లో జరిగిన నష్టం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. అనంతరం నిర్వహించిన విచారణల్లో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ, న్యాయ కమిషన్ పలు నిర్మాణ, డిజైన్, నిర్వహణ లోపాలను గుర్తించాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,000 కోట్ల అంచనా వ్యయంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. 2014 నాటికే దాదాపు మూడోవంతు పనులు పూర్తయ్యాయని చెప్పారు. అదే ప్రాజెక్టును కొనసాగించి ఉంటే 2016-17 నాటికే పూర్తయి సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు.అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ-డిజైన్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచిందని విమర్శించారు. రూ.38,000 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం లక్ష కోట్ల రూపాయలు దాటిందని, కాగ్ అంచనాల ప్రకారం అది రూ.1.45 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇంత భారీ ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ 2023 డిసెంబర్ 7 తర్వాత మూడు బ్యారేజీలు వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు.

# ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి

## - మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ,జూన్ 10 :** ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజ నాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పీఎం-జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు. ఆదివాసీల కోసం ఏర్పాటుచేసిన పథకాలు ఇవని తెలిపారు. మోదీ స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారతదేశపు బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ఆశను.. నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి కొనియాడారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని దేశాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తారని విశ్వాసం వ్యక్తంచేశారు.

# ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందిస్తున్న రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్టలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం' అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

# మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు

**హైదరాబాద్,జూన్ 10 :** మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పాదచారులు నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయ స్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచ్ఎం సీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశిం చిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ, హెచ్ఆర్ఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో విచారణను 17వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. 'తెలంగాణ-ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

# పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

(మొదటి పేజీ తరువాయి)

కాపాడాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు.

# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

◆రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు

◆మున్నేరు వరద సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం పారిశుద్ధం, పచ్చదనం పెంపుతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించాలి

◆3.05 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో బీటీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం/ జూన్ 10/(పీపుల్స్ న్యూస్)





ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభు త్వం అమలు చేస్తోందన్నారు. ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధం గా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవా రీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతు న్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య లకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్య లను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా పాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమ ంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబం ధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి.

- బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు



ఖమ్మం/నేలకొండపల్లి/జూన్10/(పీపుల్స్ న్యూస్) ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీ జులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసు కోవాలని బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు విద్యాశాఖ ఉన్నత అధికారులను డిమాండ్ చేశారు. నేలకొండపల్లి విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. వివిధ రకాల పేర్లతో విద్యా సంస్థలను ఏర్పాటు చేసి, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రవేశాలను చేపడుతున్నట్లు ఆరో పించారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తూ లక్షలాది రూపాయల ఫీజులు కట్టించుకుంటు న్నారని అన్నారు. విద్యా శాఖాధికారులు విద్యా సంస్థలను తనిఖీ చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు.

## భర్త ను హత్య చేసిన కేసులో భార్యకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష

హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, జూన్ 10 (పీపుల్స్ న్యూస్) :



భర్త ను హత్య చేసిన కేసులో భార్యకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. ఈ సంఘటన బహదూ ర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగి న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ బహదూర్ పురా, కిషన్‌బాగ్ పరిధిలోని కొండారె డ్డిగూడలో2024 ఏప్రీల్ 08న ఒక దారుణ ఘటన చోటుచేసుకుంది. మృతుడు గడ్డం నరసింహులు అలియాస్ నరసింహ నిరంతరం తన భార్య, మేనల్లుడు , మైనర్ అయిన మేనకోడలిని శారీరకంగా, మానసికం గా వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో2024 ఏప్రీల్ 08న తెల్లవారుజామున నరసింహులు మద్యం మత్తులో ఉన్న సమయంలో భార్య, మేనల్లుడు , మైనర్ బాలికలు కలిసి అతని తలపై ఇనుప పెనంతో తీవ్రంగా పదే పదే దాడి చేశారు. ఈ దాడిలో నరసింహులుకు ప్రాణాంతక గాయాలై అక్కడికక్కడే మరణించాడు. హత్య అనంతరం, నిందితులు ఈ నేరాన్ని దాచడానికి , సాక్ష్యాలను నాశనం చేయడానికి మృతదేహాన్ని రహస్యంగా ఖననం చేయాలనే ఉద్దేశంతో పురానాపూల్‌లోని శ్మశాన వాటికకు తరలించేందుకు ప్రయత్నించారు. దీనిని గమనించిన ఒక పొరుగు వ్యక్తి 'డైల్-100' ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. బహదూర్‌పురా పోలీసులు తక్షణమే స్పందించి, అంత్యక్రియల ఊరేగింపును అడ్డుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వైద్య నివేదికలో మృతుడి తల, ముఖంపై పదునైన ఆయుధంతో నరికిన బహుళ గాయాలు ఉన్నట్లు తేలింది, ఇది ముమ్మాటికీ హత్యేనని వైద్యులు నిర్ధారించారు. దర్యాప్తు లో భాగంగా సాక్షుల వాంగ్మూలాలు వైద్య నివేదికల ఆధారంగా నిందితులపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ హైదరాబాద్‌లోని ×ఎ అడిషనల్ సెషన్స్ కోర్టులో సెషన్స్ నిందితురాలు గడ్డం పూజ ( 36) పై మోపబడిన నేరారోపణల విచారణ పూర్తయిన తర్వాత ×ఎ అడిషనల్ సెషన్స్ జడ్జి జె. విక్రమ్ బుధవారం తీర్పును వెలువరించారు. నిందితురాలు పూజను దోషిగా నిర్ధారిస్తూ కోర్టు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ. 5,000/- జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలల సాధారణ జైలు శిక్ష విధించారు. బహదూర్‌పురా పోలీస్ స్టేషన్ అప్పటి ఇన్స్పెక్టర్ రఘునాథ్ అత్యంత నిబద్ధతతో జరిపిన దర్యాప్తు కారణంగానే ఈ శిక్ష పడింది. రాజేంద్రనగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్. శ్రీనివాస్, బహదూర్‌పురా పోలీస్ స్టేషన్ ప్రస్తుత ఇన్స్పెక్టర్ ఎండి. షాకీర్ అలీ దర్యాప్తు అధికారిని, ప్రాసిక్యూషన్ బృందాన్ని, కోర్టు డ్యూటీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. నేరస్థులకు శిక్ష పడేలా చేయడంలో హైదరాబాద్ సిటీ పోలీస్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పస్రా గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సభ నిర్వహించడం జరిగింది.









పస్రా ములుగు జిల్లా ప్రతినిధి జూన్ 10( పీపుల్స్ న్యూస్)

ఈ సమావేశంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించే 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం దీనికి సంబంధించిన ట్రాఫిక్ వాల్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుమలత , పస్రా సి ఐ దయాకర్ ఎస్ ఐ తాజుద్దీన్ పంచాయతీ కార్యదర్శి , ఉప సర్పంచ్ వార్డు సభ్యులు , వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పత్రికా విలేకరులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడకం వల్ల జరిగే నష్టాలను వివరించారు. అనంతరం గ్రామంలో పర్యావరణ పరిరక్షణ కోసం సి ఐ దయాకర్ ఎస్ ఐ తాజుద్దీన్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# బోయిన్‌పల్లి విద్యుత్ శాఖ డీఈ గా జీ. శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

బాలానగర్ జూన్ 11 ( పీపుల్స్ న్యూస్) మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా బోయిన్‌పల్లి విద్యుత్ శాఖ ఆపరేషన్స్ డివిజన్‌లో నూతన అధ్యాయం ప్రారంభమైంది. బోయిన్‌పల్లి విద్యుత్ శాఖ ఆపరేషన్స్ డివిజనల్ ఇంజనీర్ (డీఈ)గా జీ. శ్రీకాంత్ బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ డీఈగా సేవలందించిన వి. గోపాల్ రావు పదవీ విరమణ చేయడంతో... ప్రస్తుతం సికింద్రాబాద్ డీపీఈ డీఈగా ఉన్న శ్రీకాంత్‌కు ఈ అదనపు బాధ్యతలను అప్పగించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో నూతన డీఈ శ్రీకాంత్ మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించడమే తమ తొలి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ?డీఈ శ్రీకాంత్ కీలక సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న లోటుపాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ సరిదిద్దుతాం. డివిజన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి... ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేస్తాం. అవసరమైన చోట్ల కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కార్యాలయానికి చేరుకున్న నూతన డీఈ శ్రీకాంత్‌కు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఏడీఈలు సతీష్, హాక్, సూర్యప్రకాష్, నాగరాజు, ఏఈలు అక్బర్, వీణ, రాణి, మౌనిక, రాములు, అఖిల్ ఇతర సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.




## ఐటీ ఏరియాలో ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్

## - పారిపోయిన డ్రగ్‌డాన్ నీతూబాయ్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ కేసులు కలవర పెడుతున్నాయి. ఈ సమస్యను రూపుమాపేందుకు ఈగల్ ఫోర్స్ శ్రమిస్తోంది. దీనిలో భాగంగానే హైదరాబాద్ ఐటీ ఏరియాలో డ్రగ్‌డాన్ నీతుబాయ్ కోసం ఈగల్ ఫోర్స్ భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈగల్ ఫోర్స్ వస్తుందన్న సమాచారంతో డ్రగ్‌డాన్ నీతూబాయ్ పారిపోయింది. ఈగల్ ఫోర్స్ అదుపులో ఐటీ ఉద్యోగులు : హైదరాబాద్? నగరంలో నీతూబాయ్ పెద్ద ఎత్తున గంజాయి విక్రయిస్తోంది. గంజాయి కొనుగోలు కోసం ఐటీ ఉద్యోగులు ఆమె ఇంటి దగ్గర క్యూ కట్టారు. గంటల వ్యవధిలో 50 మంది ఐటీ ఉద్యోగుల్ని ఈగల్ ఫోర్స్ పట్టుకుంది. ఆమె దూల్‌పేట నుంచి వచ్చి ఐటీ కోర్ ఏరియాలో గంజాయి కేంద్రాన్ని నిర్వహిస్తోంది. కిరాణం షాపు మాటున గంజాయి విక్రయిస్తోందని సమాచారం. పోలీసులు గతంలోనే ఆమెను అరెస్టు చేసి పీడీ యాక్ట్ పెట్టారు. అయినా జైలు నుంచి వచ్చి మళ్లీ గంజాయి అమ్మకాలు కొనసాగిస్తోంది.

# ఎనిమిదో తరగతికే లక్ష ఫీజు! - ప్రైవేటు స్కూళ్ల అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట ఎలా?




**హైదరాబాద్:** పిల్లలకు ఉత్తమ విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆశయాన్ని పలు ప్రైవేట్? పాఠశాలల యాజమాన్యాలు అవకాశంగా మలుచుకుంటున్నాయి. ప్రతి ఏడాది ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ మధ్యతరగతి, పేద వర్గాలపై అధిక భారాన్ని మోపుతున్నాయి. రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో చాలా వాటిలో సీబీఎస్?ఈ, ఒలంపియాడ్?, ఐఐటీ ఫౌండేషన్?, టెక్నో, ఐఐటీ ఫౌండేషన్? పేరిట ప్రచారంతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. నర్సరీ, ఎల్?కేజీ, యూకేజీల్లోనే రూ.50 వేలలోపు వసూలు చేస్తున్నారు. ఇక కొత్త అడ్మిషన్? అయితే అదనంగా రూ.2 వేల వరకు చెల్లించాల్సిందేనని తేల్చి చెబుతున్నారు.జగిత్యాలకు చెందిన లక్ష్మినారాయణది దిగువ మధ్యతరగతి కుటుంబం. స్థానికంగా ఓ వస్త్ర దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నారు. తన కుమార్తె నాలుగో తరగతి, కుమారుడు 8వ తరగతి చదువుతున్నారు. అక్కడే ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించడానికి వెళ్లగా నాలుగో తరగతికి రూ.40 వేలు, ఎనిమిదో తరగతికి రూ.72 వేలు ఫీజు చెల్లించాలని యాజమాన్యం తెలపడంతో అవాక్కయ్యారు.నియంత్రణ కరువు : ప్రైవేట్? స్కూల్?ల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో కొన్ని యాజమాన్యాలు అధికంగా నిర్ణయించారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విధంగా వసూలు చేయాలి. గతంలో ప్రాథమిక తరగతులకు రూ.9వేలు, ఉన్నత తరగతులకు రూ.13 వేలకు సర్కారు నిర్ణయించగా ఆయా యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీంతో సదరు ఉత్తర్వులు నిలిపివేశారు. అప్పటినుంచి పాఠశాల యాజమాన్యాలే ఫీజులు నిర్ణయించుకునే వెలుసుబాటు కల్పించింది. ఫీజుల క్రమబద్ధీకరణకు కమిటీ లేకపోవడంతోనే ఈ సమస్యకు కారణమైంది."అధిక ఫీజుల వసూళ్లకు సంబంధించి మాకెలాంటి ఫిర్యాదు రాలేదు. ఫీజుల నిర్ణయం ఆయా పాఠశాలల యాజమాన్యాలదే. సౌకర్యాలకు సంబంధించి నిబంధనలు అతిక్రమిస్తే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం" - రాము, డీఈవో, జగిత్యాలఅన్నింటికీ చెల్లించాల్సిందే! : 5వ తరగతి నుంచి 7 తరగతి వరకు రూ.35 వేల నుంచి రూ.70 వేల వరకు ఫీజులున్నాయి. 8వ తరగతి నుంచి 10వ తరగతికి రూ.లక్ష పైనే ఉంది. మరి ఇంత ఫీజులు ఎందుకని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే పిల్లలకు ఐఐటీ ఫౌండేషన్? కోర్సు బోధిస్తున్నామని ఏదో మాటలు చెబుతున్నారు. మరోవైపు పాఠశాల యూనిఫాం, టై, బూట్లు, బెల్ట్? ఇలా అన్నింటికీ ప్రత్యేక ధరలు నిర్ణయించి తమవద్దే కొనుగోలు చేయాలని యాజమాన్యాలు నిబంధన విధించాయి. కానీ దీనివల్ల తల్లిదండ్రులకు అదనపు భారం అవుతోంది.పుస్తకాల కొనుగోలుకు రూ.3-8 వేల వరకు : ప్రైవేటు ఉద్యోగుల వేతనాలు, ఉపాధి శ్రామికులు, రోజువారీ కూలీల వేతనాలు ప్రతి ఏడాది పెరిగే పరిస్థితి ఉండదు. అయితే పిల్లల చదువులకు వచ్చేసరికి ప్రతి ఏటా స్కూల్? ఫీజులకు, పుస్తకాలకు వెచ్చించే ఫీజు చెల్లింపులు పెరుగుతుంది. కేవలం నర్సరీ చదువుకు పాఠశాల పరిస్థితిని అనుసరించి రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇవన్నీ చూస్తుంటే చదువులు ఎంత ఖరీదుగా ఉన్నాయనే విషయం ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కేవలం పుస్తకాలు కొనుగోలు చేసేందుకే రూ.3 నుంచి రూ.8 వేల వరకు పాఠశాల యాజమాన్యాలు వసూలు చేస్తున్నారు.యాజమాన్యాల కాసుల వర్షం : కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో 1000 నుంచి 2000 మంది వరకు విద్యార్థులు ఆయా తరగతుల్లో చదువుతున్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైతే ఆ యాజమాన్యాలకు కాసుల వర్షం కురుస్తోంది. ఉదాహరణకు ఆ పాఠశాలలో 2000 మంది విద్యార్థులు ఉన్నారనుకుంటే సుమారుగా ఒక్కో విద్యార్థిని రూ.5 వేలు చొప్పున అనుకున్న కేవలం పుస్తకాల మీదే రూ.కోటికి పైగా వ్యాపారం జరుగుతోంది. దీనిలో సుమారు 40 శాతం వారికి లాభం ఉండనుంది.

# మధ్య ప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

**-- బీజేపీ కుటిల రాజకీయాలపై టీపీసీసీ తీవ్ర ఆగ్రహం**

**బాలానగర్ జూన్ 11 (పీపుల్స్ న్యూస్)** మధ్యప్రదేశ్‌లో జరగనున్న రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీమతి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా నిలిచిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ తీవ్రంగా విమర్శించారు. జూన్ 18న జరగ నున్న రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలమైన పోటీ ఇవ్వ నున్న నేపథ్యంలో రాజకీయంగా ఎదుర్కోలేక అధికార పార్టీ బీజేపీ కుట్రలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. సాంకేతిక కారణాలను సాకుగా చూపిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌ను రద్దు చేయించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు.



**-- "ఓటు చోరీ నుంచి సీటు చోరీ వరకు"......**

మధ్యప్రదేశ్ అసెంబ్లీలో బీజేపీకి గణనీయమైన సంఖ్యాబలం ఉన్నప్పటికీ, మూడో రాజ్యసభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గట్టి పోటీ ఎదురవుతుందని గ్రహించిన బీజేపీ ప్రజాస్వామ్య పద్ధతులను పక్కనబెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడిందని మదన్ మోహన్ ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలవలేమని తెలిసి, నామినేషన్ ప్రక్రియనే అడ్డుకునే ప్రయత్నం చేయడం "ఓటు చోరీ" నుంచి "సీటు చోరీ" వరకు బీజేపీ రాజకీయాలు దిగజారిపోయినట్లు స్పష్టమవుతోందని విమర్శించారు.

**-- లేని కేసును చూపి నామినేషన్ రద్దు....**

శ్రీమతి మీనాక్షి నటరాజన్‌పై ఎటువంటి క్రిమినల్ కేసు నమోదు కాలేదని, కేవలం ఒక నోటీసు మాత్రమే జారీ అయిందని తెలిపారు. ఆ నోటీసుకు ఇప్పటికే న్యాయపరమైన సమాధానం కూడా ఇచ్చారని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ లేకుండా, చార్జ్‌షీట్ లేకుండా ఉన్న అంశాన్ని క్రిమినల్ కేసుగా చిత్రీకరించి నామినేషన్ తిరస్కరించడం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నమోదైన క్రిమినల్ కేసుల వివరాలనే వెల్లడించాల్సి ఉంటుందని గుర్తుచేశారు.

**-- కాంగ్రెస్ బలానికి భయపడిన బీజేపీ......**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు విఫలమవుతాయని ముందే అంచనా వేసిన బీజేపీ, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే కుట్రలకు తెరలేపిందని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేక, పరిపాలనా వ్యవస్థలను ఉపయోగించి ప్రత్యర్థి అభ్యర్థిని పోటీ నుంచి తప్పించడం బీజేపీ భయానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**-- ద్వంద్వ వైఖరిపై కాంగ్రెస్ ప్రశ్న.....**

గతంలో స్మృతి ఇరానీ ఎన్నికల అఫిడవిట్‌కు సంబంధించిన వివాదాల విషయంలో ఎన్నికల సంఘం స్పందించిన తీరు ఒకలా ఉండగా, కాంగ్రెస్ అభ్యర్థుల విషయంలో మాత్రం మరోలా వ్యవహరించడం ద్వంద్వ నీతికి నిదర్శనమని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ డిమాండ్లు

**-- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను తక్షణమే సమీక్షించాలి.**

ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించి న్యాయం చేయాలి.ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యలను నిలువరించాలి.అవసరమైతే న్యాయపరమైన పోరాటంతో పాటు దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు చేపడతాం.

**-- "ఇది సీటు చోరీ" -- కాంగ్రెస్.....**

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మదన్ మోహన్, "ఇది కేవలం నామినేషన్ తిరస్కరణ కాదు, ప్రజాస్వామ్యాన్ని అపహరించే సీటు చోరీ" అని పేర్కొన్నారు. రాజ్యసభ, లోక్‌సభలపై సంపూర్ణ ఆధిపత్యం సాధించి రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. "ప్రజాస్వామ్యాన్ని రక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత. అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తుంది" అని మదన్ మోహన్ తెలిపారు

# ఆపదలో ఉన్న అప్పురాలికి దోస్తుల అపన్నహస్తం.

- కాళ్ళు పడిపోయిన మహిళలకు చేయూత
- ట్రై సైకిల్, వీల్ చైర్, రూ.25వేల ఆర్థిక సాయం
- వెంకటాపూర్ లో పదవ తరగతి దోస్తుల సాయం





**ములుగు జిల్లా ప్రతినిధి జూన్ 10 (పీపుల్స్ న్యూస్)** వెంకటాపూర్ చిన్ననాటి నుంచి తమతో కలిసి నడిచింది.. కలిసి చదివింది.. ఆడుతూ పాడుతూ సరదాగా గడిపింది.. కాలం కలిసి రాక వచ్చిన పెరాలసిస్ వ్యాధితో రెండు కాళ్లు కోల్పోయిన మహిళకు 10వ తరగతి స్నేహితులు ఆపన్న హస్తం అందించారు. అందరూ వదిలేసినా, తల్లి మరణించినా మేమున్నామని భరోసా ఇచ్చారు.. ములుగు జిల్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన అన్నెబోయిన రాజకళకి కొంతకాలం క్రితం పెరాలసిస్ వచ్చి రెండు కాళ్లు కోల్పోయి నడవలేక ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న తన తోటి 2003-04 పదవ తరగతి మిత్రులందరు కలిసి మేమున్నామంటూ భరోసా కల్పించారు. బుధవారం రాజకళ ఇంటికి వెళ్ళి పరామర్శించిన స్నేహితులు ఆమెకు ట్రై సైకిల్ , వీల్ చైర్ తో పాటు రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చినా మేమున్నామంటూ భరోసా కల్పించారు. కాగా, తన దీనస్థితికి చలించి ఆదుకున్న మిత్రులకు రాజకళ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్రులు గాలి రాజ్ కుమార్, అనుముల కృష్ణ, బానోత్ లలేందర్, తంగళ్ళపల్లి దేవరాజు, పోలు శ్రీ కుమార్, నరేష్, నళిగంటి రాము, సొప్పరి బిక్షపతి, చంద్రమోహన్, మాకుల రజిత, వడ్డేపల్లి కల్పన, జంగిలి మమత, ఈశ్రాత్, సాద మమత తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటకలోని ఉడిపిలో తెలంగాణ పర్యాటకుడిపై దాడి - నిందితుడు అరెస్టు



**హైదరాబాద్:** కర్ణాటకలోని ఉడిపి శ్రీ కృష్ణ మఠం ప్రాంగణంలో హైదరాబాద్ వ్యక్తిపై స్థానిక వ్యక్తి దాడి చేశాడు. వాహనం పార్కింగ్? చేసే సమయంలో మొదలైన వాగ్వాదం క్రమంగా స్టాండ్, కుర్చీ, ఇనుప వస్తువులతో దాడి చేసుకునేంత వరకు దారితీసింది. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో దాడికి పాల్పడిన వ్యక్తిని ఉడిపి సిటీ పోలీసులు అరెస్టు చేశారు.అసలేం జరిగిందంటే : పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన రంగారావు తన కుటుంబంతో కలిసి శ్రీ కృష్ణ మఠాన్ని దర్శించుకోవడానికి ఉడిపికి వెళ్లారు. అక్కడ కారు పార్క్ చేసి రోడ్డు దాటుతుండగా, ఓ కారు వేగంగా వారి దగ్గరి నుంచి వచ్చింది. దీంతో ఆగ్రహించిన రంగారావు, వాహనం నడుపుతున్న? సుప్రీత్ కుమార్?తో వాగ్వాదానికి దిగారు. దీంతో వాదన కాస్త పెరిగి కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో రంగారావుపై సుప్రీత్ కర్రతో దాడిచేశాడు. దీంతో రంగారావు తలకు గాయం అయ్యి తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కాగా ఉడిపి సిటీ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 71/2026 కింద కేసు నమోదైంది.ఇనుప వస్తువులతో తనపై దాడి చేశారని : ఇంకో వైపు అదే ప్రాంతానికి చెందిన సుప్రీత్ కుమార్ మరో ఫిర్యాదు దాఖలు చేశారు. అతడి ఫిర్యాదు ప్రకారం, తెలంగాణ రిజిస్ట్రేషన్ నంబర్ ఉన్న ఓ వాహనం నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ అతడి ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ విషయం గురించి ప్రశ్నించినప్పుడు ఆ కారులోని డ్రైవర్?, ఇతర వ్యక్తులు అక్కడే తనతో వాదనకు దిగారని చెప్పాడు. దగ్గరలో ఉన్న ఫోటో స్టాండ్, కుర్చీ, ఇనుప వస్తువులతో తనపై దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో సుప్రీత్ నాలుకకు గాయమై రక్తస్రావం జరిగిందన్నారు. ఈ దాడులతో కారు ముందు అద్దం, సైడ్ మిర్రర్ కూడా దెబ్బతిన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సంబంధించి క్రైమ్ నంబర్ 72/2026 కింద ఫిర్యాదు నమోదైంది.

# షూటింగ్ కి అనువైన ప్రాంతం ములుగు జిల్లా

- సినిమా దర్శకుడు నేరెళ్ల దేవేందర్
- అందుగులమేది ప్రాంతంలో సినిమా చిత్రీకరణ





**ములుగు జిల్లా ప్రతినిధి జూన్ 10( పీపుల్స్ న్యూస్)** షైన్ స్టూడియో బ్యానర్ పై రూపొందుతున్న "ప్రొడక్షన్ నెం. 2 సినిమాను ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయంలో ఇటీవల మంత్రి సీతక్క తనయుడు సూర్య క్లాప్ కొట్టి సినిమా షూటింగ్ ను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా, సినిమా సినిమా దర్శకుడు నేరెళ్ల దేవేందర్ ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా సదురు సినిమా చిత్రీకరణ వెంకటాపూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ క్రమంలో



బుధవారం వెంకటాపూర్ మండలంలోని అందుగులమేది గ్రామ పరిసర ప్రాంతాల్లో సైతం సినిమా చిత్రకరణ జరిపారు. హీరో-హీరోయిన్ పై పలు సన్నివేశాలను గ్రామ శివారులోని ఓ మంచే వద్ద డైరెక్టర్ దేవేందర్ ఆధ్వర్యంలో యూనిట్ సభ్యులందరూ చిత్రీకరించారు.ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు నరేళ్ళ దేవేందర్ మాట్లాడుతూ... సినిమా షూటింగులకు ములుగు జిల్లా అనువైన ప్రాంతమని ఆయన కొనియాడారు. ములుగు జిల్లాలో అనేక పుణ్యక్షేత్రాలతో పాటు అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి ములుగు ప్రాంతంలో సినిమా చిత్రీకరణ జరిపే అవకాశం లభించడం తాను అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. షైన్ స్టూడియోస్ బ్యానర్ పై సినిమాను చిత్రీకరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రొడ్యూసర్ వేణు యాదవ్, హీరో -హీరోయిన్ లతో పాటు మూవీ డైరెక్టర్ నేరెళ్ల దేవేందర్, కో డైరెక్టర్ ఆర్య అరవింద్, లిరిక్స్ రైటర్ రాజ్ కుమార్, మూవీ ఎడిటర్ యూనిక్, డిఓపి తరుణ్, అసిస్టెంట్ డైరెక్టర్ లోకేష్, ప్రొడక్షన్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గౌతమ్, యూనిట్ సభ్యులు సిద్ధు, రఘు, రాహుల్, రఘుపతి, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నుంచి ప్రకృతి వైపు..

**◆గంజాయి కేసుల్లో శిక్ష పడిన వారితో వృక్షరూపణ కార్యక్రమం**

**వ్యక్తిత్వ వికాసం కోసం వృక్షారోపణ కార్యక్రమం**

**◆గంజాయి ఇతర మత్తు పదార్థాల సమాచారం అందించిన వారికీ 5,116 /-రూపాయల బహుమతి**

**◆యువత మత్తుకు బానిస కావద్దు**

**జిల్లా ఎస్ పి కేకాన్ సుధీర్ రంనాథ్ ఐ పి ఎస్**







**ములుగు జిల్లా ప్రతినిధి జూన్ 10 (పీపుల్స్ న్యూస్)** ములుగు జిల్లా ఎస్పీ శ్రీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నేడు ప్రత్యేక వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించబడింది. గంజాయి కేసుల్లో అరెస్టై కోర్టు ద్వారా శిక్ష పొందిన నలుగురు వ్యక్తులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసి వారి చేత మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి జీవితంలో మార్పు సాధ్యమేనని, గత తప్పిదాలను పునరావృతం చేయకుండా సమాజానికి ఉపయోగపడే మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా, జీవితంలో సానుకూల మార్పుకు ఇది ఒక ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంజాయి సంబంధిత "లీగల్ టీం" పాల్గొన్నారు. అదనపు ఎస్పీ (ఏఆర్) బొంగోని సదానందం, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ములుగు సీఐ దారం సురేష్, ఆర్ ఐ అడ్మిన్ రాధారపు స్వామి, ములుగు ఎస్ఐ ఉపేందర్, పీఎస్ఐ బుట్ట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ములుగు జిల్లా పోలీసు శాఖ సమాజంలో అవగాహన పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని అధికారులు తెలిపారు.

# ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్లలో వేగం పెంచాలి

**■వీవో భవనాల నిర్మాణాలు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి**

**■గిరిజన ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించాలి**

**■జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు జిల్లా ప్రతినిధి జూన్ 10( పీపుల్స్ న్యూస్)** ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచాలని, వీవో భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో ఉపాధి హామీ పథకం, వీవో భవనాల నిర్మాణ పురోగతి, ఇందిరమ్మ ఇండ్లు, ప్లాంటేషన్, సామాజిక భద్రతా పెన్షన్లు, ఇందిరా మహిళా శక్తి కేంద్రం, పెట్రోల్ బంక్ ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య గణనీయంగా పెంచి, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీవో భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, యుద్ధ ప్రాతిపదికన నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రతి దశలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న మొక్కల నాటే కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిస రిగా చేరుకోవాలని ఆదేశించారు. నాటిన మొక్కల సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లాలో అమలవుతున్న వివిధ కేటగిరీల సామా జిక భద్రతా పెన్షన్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన పెన్షన్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హులైన వారి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా ఇందిరా మహిళా శక్తి కేంద్రం భవనం ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులు త్వరితగతిన పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న మిర్చి--పసుపు ప్రాసెసింగ్ యూనిట్, ఇప్పపూల లడ్డు తయారీ యూనిట్ కార్యకలాపాలు, ఉత్పత్తుల క్రయవిక్రయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించి, మార్కెట్ అవకాశాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ఉత్పత్తులకు బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి ఆదాయాన్ని పెంచే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డీఆర్‌డీఏ పిడి చంద్రశేఖర్, అదనపు పీడి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# అత్యాశ వదులుకుంటేనే సైబర్ క్రైమ్ కంట్రోల్ అవుతుంది : డీజీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్** అత్యాశ వదులుకుంటేనే సైబర్ క్రైమ్ కంట్రోల్ అవుతుందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అదిలాబాద్? జిలాల్లో పర్యటించిన డీజీపీ, రాష్ట్రంలో మావోయిస్టుల స్థితి, లా అండ్ ఆర్డర్‌పై స్పందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మావోయి స్టులందరూ పోలీసులకు లొంగిపోయారని డీజీపీ తెలిపారు. రాష్ట్రంలో నక్సలిజం లేదని ప్రకటించారు. మావోయిస్టులకు రివార్డులు కూడా ఇచ్చేశామని, ప్రస్తుతం వారికి ఉపాధి కల్పించే పనిలో ఉన్నామని పేర్కొన్నారు. మావోయిస్టులే లేనందున వారి ఏరివేత కోసం ఏర్పాటు చేసిన బలగాలను ఇతర సేవలకు వినియోగిస్తామని వివరించారు. మాజీ మావోయిస్టులకు ఇళ్ల పట్టాలు : దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఉనికి లేదని, ఆ పార్టీలో ఒకరిద్దరు మాత్రమే మిగిలి ఉన్నారని, అందుకోసం వారి నియంత్రణ కోసం గ్రేహౌండ్స్ దళాల్లో ఉన్న 1200 మంది సిబ్బందిలో 500 మందిని తగ్గించి వివిధ విభాగాల్లో సర్దుబాటు చేస్తామని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయన ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. గుడిహత్నూర్ మండలం తోషంలో ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. వారితో కలిసి లొంగిపోయిన ముగ్గురు మాజీ మావోయిస్టులకు ఇళ్ల పట్టాలు, వాహనదారులకు హెల్మెట్లు, స్థానికులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆదిలాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్, పిల్లల పార్కు, కమాండ్ కంట్రోల్ రూంలను ప్రారంభించారు. అనంతరం ఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గ్రేహౌండ్స్ విభాగానికి 1700 పోస్టులు మంజూరైతే 1200 మంది పని చేస్తున్నారని, వారిలో 500 సిబ్బందిని ఇతర కార్యక్రమాల్లో సర్దుబాటు చేస్తామని వెల్లడించారు. "30, 40 సంవత్సరాల నుంచి మన రాష్ట్రం మొత్తం ఒకే ఆలోచనతో పని చేసింది. అంటే నక్సలైట్లు, మావోయిజం దానిని ఎదుర్కొడానికి సంస్థల్ని ఏర్పాటు చేశాం. గ్రేహౌండ్స్?, ఎస్?ఐబీ ఇటువంటివి. కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవటం వల్ల అది ఇప్పుడు పూర్తిగా పోయిందని మనం భావించవచ్చు. టాప్ క్యాడర్లు ఎవరైతే ఉన్నారో సెంటర్‌కమిటీ మెంబర్స్ అందరూ కూడా సరెండర్ అయిపోయారు. లేకపోతే ఎన్?కౌంటర్లలో చనిపోయారు. ఆ సమస్య మనకు ఇప్పుడు పోయింది కనుక ఆ సంస్థలోని ఫోర్స్‌ను తగ్గించాం. డ్రగ్స్, సైబర్ సెక్యూరిటీ, సైబర్ క్రైమ్, ట్రాఫిక్, హైవే ఆక్సిడెంట్స్?, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవైతే ఉన్నాయో దాని వింగ్స్, ట్రాఫిక్ మ్యానేజ్?మెంట్ బ్యూరో ఇటువంటి కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం. కొత్త దిశలో మా డిపార్ట్?మెంట్ అంతా పయనిస్తుంది" – సీవీ ఆనంద్, డీజీపీయువత పెడదారి పడుతున్నారు : తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాలపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నక్సలిజం అంతరించిన మాదకద్రవ్యాల వినియోగంతో యువత పెడదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తప్పక హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా తొలుత పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.


## హైదరాబాద్‌లో కోళ్ల వ్యర్థాల అక్రమ రవాణా

## - 120 టన్నుల చికెన్ వేస్ట్ సీజ్




**హైదరాబాద్:** పలు ప్రాంతాల నుంచి చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న 7 లారీలను పోలీసులు సీజ్ చేశారు. వీటిని చేపలకు ఆహారంగా వాడుతున్నట్లు గుర్తించిన పోలీసులు 120 టన్నుల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యర్థాలు గుంటూరు, భీమవరం వినుకొండ, అద్దంకిలోని చేపల చెరువులకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యర్థాలు తిన్న చేపలతో ఆరోగ్యానికి ప్రమాదకరమని పోలీసులు చెప్పారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం టాస్క్ ఫోర్స్ డీసీపీ, వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. ప్రశ్న : ఈ దందా ఎక్కడ జరుగుతుంది? ఈ వ్యర్థాలను ఎక్కడికి తరలిస్తున్నారు? ఈ రోజు హెచ్? ఫాస్ట్? టీమ్? చికెన్ వేస్ట్?? ట్రాన్స్?పోర్ట్? గ్యాంగ్?పై దాడులు నిర్వహించింది. దీనిలో నలుగురిని అదుపులోకి తీసుకున్నాం. 7 వాహనాలను సీజ్? చేశాం. భారీ మొత్తంలో చికెన్? వేస్ట్? లభించింది. నగర వ్యాప్తంగా వృధా అయిన చికెన్?ను చిన్నచిన్న షాపుల నుంచి అక్రమంగా ఆంధ్రప్రదేశ్?కు పంపుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, చికెన్? వ్యర్థాలను జీహెచ్?ఎంసీ పరిధిలోని శుద్ధి కర్మాగారానికి పంపాలి. అక్కడ దీనిని ప్రాసెస్ చేసిన తర్వాత డాగ్ ఫీడింగ్, ఫిష్? ఫీడింగ్?, పౌల్ట్రీ ఫారమ్?లకు పంపిణీ చేయొచ్చు. అయితే ఆలా చేయకుండా అనేకమంది అక్రమంగా చికెన్? షాపుల నుంచి వీటిని కొనుగోలు చేసి నేరుగా ఆంధ్రప్రదేశ్?లోని పలు ప్రాంతాలకు అమ్ముతున్నారు. ఇలా పాడైన చికెన్ వ్యర్థాల?ను చేపలకు ఆహారంగా వీటిని వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యానికి హానికరం, దీనిలో అనేక హానికర రసాయనాలు కూడా ఉంటాయి. ఈ ఆహారం తీసుకున్న చేపలను మనం తినడంతో క్యాన్సర్? లాంటి వ్యాధులు వస్తాయి. ఈరోజు నలుగురిని అరెస్టు చేశాం. దీనిలో ఇంకా ఎవరెవరు ఉన్నారు అనే విషయంపై గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వీరిపైన కూడా చర్యలు తీసుకుంటాం. ప్రశ్న : ఇవి ప్రధానంగా నగరంలోని ఏయే ప్రాంతాల నుంచి తరలిస్తున్నారు? ఎక్కడికి తరలిస్తున్నారుహైదరాబాద్? కమిషనరేట్?లోని అనేక ప్రాంతాల నుంచి వీరు సేకరిస్తున్నారు. అంబర్?పేట్?, జియాగూడ, అత్తాపూర్? ప్రాంతాలను గుర్తించాం. ఆటోల ద్వారా చిన్న షాపుల నుంచి గొడౌన్?లోకి డంపింగ్? చేస్తున్నారు. అక్కడి నుంచి పెద్ద వాహనాలలో వీటిని ఏపీకి తరలిస్తున్నారు. దీనిలో అనేక మంది ఏజెంట్ల భాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది. ఇన్వెస్టిగేషన్ పూర్తయ్యాక వీరిపైనా చర్యలు తీసుకుంటాం. ప్రశ్న : కల్తీ చర్యలకుపాల్పడిని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? గత 3 నెలల నుంచి హెచ్ ఫాస్ట్ టీమ్ చాలా బాగా పని చేస్తోంది. హైదరాబాద్? సిటీ కమిషనరేట్? పరిధిలో ఎవరైనా ఆహారాన్ని కల్తీ చేసి, సరఫరా చేసే వారిపై నిఘాపెట్టాం. వీరిపై అనేక కేసులు వేశాము. వెజ్?, నాన్?వెజ్? ప్రొడక్ట్స్, నాంవెజ్ ప్రొడక్ట్స్, డైరీ ప్రొడక్ట్స్? ఇలా అనేక తిండి పదార్థాల కల్తీకి పాల్పడుతున్న వారిపై కేసులు బుక్ చేశాం. దీనిలో రిపీట్?గా ఇలాంటి వ్యవహారాల్లో పాల్గొనే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం. వీరికి ట్రేడ్? లైసెన్స్, షాప్? లైసెన్స్?? క్యాన్సిల్? చేస్తాం. నగరంలోని వ్యాపారులందరికీ మా విజ్ఞప్తి ఒక్కటే, వ్యాపారులంతా సక్రమంగా, మ్యానుఫ్యాక్చరింగ్, ట్రాన్స్?పోర్టింగ్? చేసి వ్యాపారాలు కొనసాగించాలి. ప్రతి ఒక్కరూ నిబంధనలను అతిక్రమించరాదు. పాడైపోయిన, కుళ్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రశ్న : చేపల చెరువులో ఇలాంటి వ్యర్థాలు వేయడం వల్ల జరిగే అనర్థాలు ఏంటిచికెన్ వేస్ట్‌ను సైంటిఫిక్‌గా ప్రాసెం చేసి ఫిష్? ఫీడ్?గా వినియోగించుకోవచ్చు. కానీ ఈ ముఠాలు వీటిని ప్రాసెస్? చేయకుండా అక్రమంగా తరలిస్తూ చేపల చెరువులకు వేస్తున్నారు. దీనిలో కార్సినోజెనిక్? ఏజెంట్లు ఉన్నాయి. ఇది మన ఆరోగ్యానికి చాలా హానికరం. ఈ చేపలను ఆహారంగా తీసుకుంటే క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ప్రశ్న : నగరంలో ఎన్ని రోజుల నుంచి ఈ దందా నడుస్తున్నట్లు మీ దృష్టికి వచ్చింది? దీనికి మీరు ఎలా స్పందించారు? దీనిలో మాకు వచ్చిన సమాచారం ఆధారంగా అనేక ఆధారాలను సేకరించాం. ఈ ముఠాలు ఏయే ప్రాంతాల్లో ఉంటున్నాయి ఎలా దందా చేస్తున్నాయి అనే విషయాలను సేకరించి ఈ రోజు వీరిని పట్టుకోగలిగాం.

## ఈఎన్సీ మోహన్?నాయక్ అక్రమాస్తులు రూ.150 కోట్లు! - రిమాండ్‌కు తరలించిన పోలీసులు



**హైదరాబాద్:** మిలమిల మెరుస్తున్న బంగారు బిస్కెట్లు! కళ్లు చెదిరేలా బ్యాంకు బ్యాలెన్స్! కట్టలు కట్టలుగా కరెన్సీ నోట్లు! గుట్టలుగుట్టలుగా అక్రమంగా సంపాదించిన దస్త్రాలు! గలగలలాడే విదేశీ మద్యం బాటిళ్లు! ఇవీ రోడ్లు, భవనాల శాఖలో ఈఎన్సీ మోహన్‌నాయక్ నివాసాల్లో ఏసీబీ కంట పడిన దృశ్యాలు. దాదాపు రూ.17.94 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తుల్ని గుర్తించిన ఏసీబీ మోహన్‌నాయక్‌ను అరెస్ట్ చేసింది. బహిరంగ మార్కెట్లో ఆ ఆస్తుల విలువ దాదాపు రూ.150 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. రహదారులు, భవనాలశాఖ ఇంజినీర్ ఇన్?చీఫ్ మోహన్‌నాయక్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అడ్డంగా దొరికిపోయారు. ఏసీబీ అధికారులు మంగళవారం ఏకకాలంలో 16 ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో మోహన్‌నాయక్ అవినీతి విశ్వరూపం బయటపడింది. హైదరాబాద్, నిజామాబాద్‌లోని ఆయన బంధువులు, సన్నిహితులు, బినామీల ఇళ్లతోపాటు ఈఎన్సీ కార్యాలయంలోనూ ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. పలు స్థిరాస్తులకు సంబంధించిన పత్రాల్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈఎన్సీ మోహన్? నాయక్ అక్రమాస్తుల చిట్టా : హైదరాబాద్ మియాపూర్‌లో రెండున్నర కోట్ల విలువైన లగ్జరీ విల్లాతో పాటు, కూకట్‌పల్లిలో రూ.62 లక్షల విలువైన ఇల్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలో 4 ఫ్లాట్లు, కొంపల్లిలో 3 ఫ్లాట్లను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. ఇవే కాకుండా, నిజామాబాద్ జిల్లా ముల్లంగి గ్రామంలో రూ.83 లక్షల విలువైన 19.38 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు తనిఖీల్లో తేల్చారు. ఇవే కాకుండా మోహన్‌నాయక్ ఇంట్లో రూ.55 లక్షల నగదును సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో మరో రూ.కోటి 44 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లో దాచి ఉంచిన రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు, 6 కిలోల వెండి వస్తువులను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హ్యామ్? రోడ్ల టెండర్స్?లో జోక్యం : నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కులాస్‌పూర్ తండాకు చెందిన మోహన్‌నాయక్ 29 ఏళ్ల క్రితం ప్రభుత్వ ఉద్యోగంలో చేరి రోడ్లు, భవనాలశాఖలో కీలక స్థానాల్లో కొనసాగారు. నల్గొండ, నిజామాబాద్‌లలో ఎస్?ఈగా పనిచేయడంతో పాటు హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్లోనూ బాధ్యతలు నిర్వర్తించారు. సీఈగా ఉంటూ గతేడాది ఆగస్టులో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమితులై నెల రోజుల వ్యవధిలోనే ఈఎన్సీగా అత్యున్నత స్థానానికి చేరారు. ఆర్?అండ్?బీ శాఖలో కోట్లలో చేపట్టిన పనుల్లో వాటాలు దండుకోవడంలో మోహన్‌నాయక్ ఆరితేరినట్లు ప్రస్తుతం చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రహదారుల బిల్లుల మంజూరులో చేతివాటం ప్రదర్శించి ఉంటారనే ప్రచారం నెలకొంది. ఇటీవల జరిగిన హ్యామ్ రోడ్ల టెండర్లలోనూ తెర వెనుక చక్రం తిప్పినట్లు ఆయనపై పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి. ఆదాయానికి మించి విపరీతంగా ఆస్తులు కూడబెట్టిన మోహన్ నాయక్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీబీఅధికారులు వెల్లడించారు. న్యాయమూర్తి హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

గురువారం, జూన్ 11, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 6

## మూడేళ్లకే అసాధారణ ప్రతిభ.. అబ్బురపరుస్తున్న ఇషాన్ కౌండిన్య



**హుజురాబాద్, జూన్ 10:** మూడేళ్ల వయస్సులోనే అద్భుత జ్ఞాపకశక్తి, అసాధారణ ప్రతిభతో హుజురాబాద్‌కు చెందిన చిన్నారి వడ్లకొండ ఇషాన్ కౌండిన్య అందరినీ ఆకట్టుకుంటున్నాడు. బండ అంకుష్‌వాడకు చెందిన స్నేహ--అర్జున్ దంపతుల కుమారుడైన ఇషాన్ ప్రస్తుతం వరంగల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నర్సరీ చదువుతున్నాడు.భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు, వాటి రాజధానుల పేర్లను వరుసగా చెప్పడమే కాకుండా భక్తి శ్లోకాలు, పద్యాలను కూడా స్పష్టంగా ఆలపిస్తూ తన ప్రతిభను చాటుతున్నాడు. సాధారణంగా చిన్నారులు ఆటపాటలతో గడిపే వయస్సులోనే ఇషాన్ చూపిస్తున్న జ్ఞాన సామర్థ్యం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.చిన్నప్పటి నుంచే విషయాలను త్వరగా గ్రహించే స్వభావం ఉన్న ఇషాన్‌కు తాము ప్రోత్సాహం అందిస్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు. చిన్నారి ప్రతిభను స్థానికులు, పాఠశాల యాజమాన్యం, పలువురు ప్రముఖులు అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## మురళీధర్ దేశ్‌పాండే మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటు

**- ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు**



**కరీంనగర్, జూన్ 10:** తెలంగాణ ఉద్యమకారుడు, ఓసీ జేఏసీ జాతీయ నేత మురళీధర్ దేశ్‌పాండే ఆకస్మిక మృతి తెలంగాణ సమాజానికి, ప్రజాసంఘాలకు తీరని లోటని ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు పేర్కొన్నారు.బుధవారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన సంతాప సభలో దేశ్‌పాండే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో దేశ్‌పాండే కీలక పాత్ర పోషించారని, అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఓసీ వర్గాల పేద విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం జరిగిన ఉద్యమాల్లో జాతీయ సలహాదారుడిగా ఆయన చురుకుగా పనిచేశారని తెలిపారు.రాష్ట్ర జేఏసీ నాయకులు డాక్టర్ విష్ణుదాస్ గోపాలరావు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం దేశ్‌పాండే చేసిన కృషి అమూల్యమని అన్నారు. జీవితాంతం ప్రజాసేవను ధ్యేయంగా తీసుకుని అనాథాశ్రమం నిర్వహిస్తూ అనాథలకు అండగా నిలిచిన మహనీయుడిగా దేశ్‌పాండే చిరస్థాయిగా నిలిచిపోతారని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ దీపక్‌బాబు, జంపాల నరసయ్య, పెండ్యాల కేశవరెడ్డి, చిన్నమనేని పురుషోత్తంరావు, ఆడెపు రమణారెడ్డి, గుండం భూమయ్య, కొత్తకొండ రవీందర్‌రావు, తాటిపల్లి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీల బిడ్డ, మడే రాజేష్ కు, డాక్టరేట్.

**- పేద విద్యార్థులకు చదువుల్లో వెలుగులు నింపుతున్న రాజేష్.**



**బెల్లంపల్లి : జూన్ 10.** సమాజం లోని పేద పిల్లలకి ఉన్నత విద్యను అందించాలనే సంకల్పాన్ని జీవిత ధ్యేయంగా పెట్టుకొని, పేద విద్యార్థుల అభున్నతే లక్ష్యంగా నిరంతరం సేవలు అందిస్తున్న మడే రాజేష్ కి అరుదైన గౌరవం దక్కింది. రాజేష్ చేస్తున్న విశిష్ట సామాజిక సేవలను గుర్తించిన ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ సంస్థ, ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేసేందుకు ఎంపిక చేశారు.మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన మడే రాజేష్, వ్యవసాయ కూలీలుగా జీవితం వెల్లదీస్తున్న, మడే భాగ్యలక్ష్మి, భీమయ్య, దంపతుల పెద్ద కుమారుడు. పేద కుటుంబం నుంచి వచ్చి వృత్తి విద్యా కళాశాల స్థాపించి సమాజంలోని పేద విద్యార్థులు, తను అనుభవించిన ఆర్థిక కష్టాలు అనుభవించకూడదనే సంకల్పంతో ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచిత విద్య, ఉన్నత చదువులు అందించాలని, .. అవసరమయిన విద్యార్థుల కు అర్థిక సహాయం అందిస్తూ, సామాజిక సేవ చేస్తున్నారు. ఈ సేవలను గుర్తించి హైదరాబాద్ లో త్వరలో జరుగనున్న అవార్డు ప్రదానోత్సవం లో గౌరవ డాక్టరేట్ ను రాజేష్, అందుకోనున్నారు.ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, తనకి లభించిన గౌరవానికి ఇంకా ఎన్నో సేవ కార్యక్రమాలు చేసేలా నాపై మరింత బాధ్యతను ఉత్సాహన్నీ పెంచిందని, పేద విద్యార్థులకు మరింత ఉన్నత చదువులు అందించేందుకు కృషి చేస్తానని ఆనందాన్నీ వ్యక్తపరిచాడు.

# డ్రగ్స్ మహమ్మారిని నియంత్రించేందుకు పోలీసులు మరింత కట్టుదిట్టంగా పనిచేయాలి

**రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్.**












**హైదరాబాద్ , క్రైమ్ బ్యూరో, జూన్ 10 (పీపుల్స్ న్యూస్) :** డ్రగ్స్ మహమ్మారిని నియంత్రించేందుకు పోలీసులు మరింత కట్టుదిట్టంగా పనిచేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల జిల్లాలోని నేరాల పరిస్థితి, పోలీసు పనితీరు, అమలు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివరించారు. 2025-26 సంవత్సరంలో నమోదైన గుర్తించదగిన నేరాల వివరాలను సమీక్షిస్తూ, గత ఏడాదితో పోల్చితే నేరాల సంఖ్యలో సుమారు 4.7 శాతం తగ్గుదల నమోదైనట్లు తెలిపారు. 2025 సంవత్సరంలో 1,155 కేసులు నమోదు కాగా, 2026 జనవరి నుంచి ఏప్రిల్ వరకు 896 కేసులు నమోదయ్యాయని వివరించారు. బైసా ప్రాంతంలో మత ఘర్షణలు పూర్తిగా తగ్గినట్లుగా ఎస్పీ వెల్లడించారు.మహిళలపై జరిగే నేరాల విషయంలో కూడా స్వల్ప తగ్గుదల నమోదైందని, గత ఏడాదితో పోల్చితే సుమారు 2.2 శాతం మేర తగ్గినట్లు తెలిపారు. అయితే పోక్సో చట్టం కింద నమోదవుతున్న కేసుల్లో పెరుగుదల కనిపిస్తున్నదని, 32 కేసులు నమోదై సుమారు 10 శాతం పెరిగినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఎన్‌డీపీఎస్ (NDPS) చట్టం కింద నమోదవుతున్న డ్రగ్స్ కేసులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న వినూత్నమైన "పోలీస్ అక్క" కార్యక్రమాన్ని డీజీపీ ప్రత్యేకం గా అభినందించారు. ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక స్కాచ్ అవార్డు లభించడం పట్ల జిల్లా పోలీసు సిబ్బందిని అభినందించారు. మహిళా పోలీసు సిబ్బందికి మరింత బాధ్యతలు అప్పగిస్తూ, లా అండ్ ఆర్డర్ విధుల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, రౌడీషీట్లు, సస్పెక్టెడ్ షీట్లు తెరవడం, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచడం వంటి చర్యల ఫలితంగా జిల్లాలో నేరాల సంఖ్య తగ్గినట్లు జిల్లా ఎస్పీ వివరించారు. డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజాన్ని అత్యంత ప్రభావితం చేస్తున్న ప్రధాన సమస్యలు సైబర్ నేరాలు మరియు మాదకద్రవ్యాలేనని అన్నారు. సైబర్ నేరాల వల్ల ప్రజలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతుండగా, డ్రగ్స్ వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సానుకూలంగా స్వీకరించి, సత్వర పరిష్కారం అందించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా పోలీసు సేవలను అందిస్తూ, ప్రజలు గుర్తుంచుకునే విధంగా పనిచేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్‌తో పాటు ఉమెన్ సేఫ్టీ, సీఐడీ, ఏసీబీ డీజీపీ చారు సిన్హా, మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎ స్పీ శ్రీనివాస్‌తో పాటు జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సీజ్ చేసినా ఆగని అక్రమ నిర్మాణం..!

- **అధికారులకు ముడుపులు ఇచ్చానని యజమాని ప్రచారం.!**
- **అధికారుల తీరుతో ప్రజలు మండి పాటు.**





**కూకట్ పల్లి : జూన్ 10 (పీపుల్స్ న్యూస్)** మూసాపేట సర్కిల్-53 పరిధిలోని మోతీనగర్ ఎక్స్టెన్షన్‌లో ఓ నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా భారీ అక్రమ నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నామమాత్రపు అనుమతులతో ప్రారంభమైన నిర్మాణం ఏకంగా జీం5 అంతస్తులతో పాటు అదనంగా పెంట్‌హౌస్ వరకు విస్తరించిందని స్థానికులు చెబుతున్నారు.అక్రమ నిర్మాణాన్ని గుర్తించిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఇటీవల భవనాన్ని సీజ్ చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, బ్యానర్లు, రిబ్బన్లు కట్టి నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశించారు. అయితే సీజ్ చేసిన మరుసటి రోజే భవన యజమాని అధికారులు ఏర్పాటు చేసిన బ్యానర్లు, రిబ్బన్లను తొలగించి తిరిగి నిర్మాణ పనులను యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.ఒకసారి అధికారికంగా సీజ్ చేసిన భవనంలో మళ్లీ నిర్మాణ కార్యకలాపాలు కొనసాగడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీజ్ అనంతరం కూడా నిర్మాణం నిరాటంకంగా కొనసాగుతుండటంతో అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇదిలా ఉండగా, సీజ్ అనంతరం సంబంధిత అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు అందజేసినట్లు భవన యజమాని తన సన్నిహితుల వద్ద పేర్కొన్నాడనే ప్రచారం కూడా స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు."సీజ్ చేసిన భవనంలో మళ్లీ నిర్మాణం ఎలా జరుగుతోంది?" అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది..?**

మూసాపేట సర్కిల్ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న అక్రమ నిర్మాణాలు స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. నామమాత్రపు అనుమతులతో బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తూ, భద్రతా ప్రమాణాలను పూర్తిగా విస్మరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవలం అద్దె ఆదాయం కోసం చిన్న స్థలాల్లో ఐదు అంతస్తులు, పెంట్‌హౌస్‌లతో భారీ నిర్మాణాలు చేపడుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా అగ్నిప్రమాదం, భవన కూలిపోవడం లేదా ఇతర ప్రమాదాలు చోటుచేసుకుంటే అందుకు బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన యజమానులా..? లేక వాటిని చూసీచూడనట్లు వ్యవహరించిన మున్సిపల్ అధికారులా..? అని నిలదీస్తున్నారు.అక్రమ నిర్మాణాల కారణంగా ఇప్పటికే తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మాత్రం తమ బాధ్యతలను విస్మరించి, నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు, ఫిర్యాదుదారుల ఆందోళనలు ఉన్నప్పటికీ కఠిన చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణాలేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడకముందే అధికారులు మేల్కొని చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# నేరాల నియంత్రణ, ప్రజా భద్రత బలోపేతంలో సీసీటీవీ వ్యవస్థ కీలక పాత్ర

**- రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్**















**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో, జూన్ 10 (పీపుల్స్ న్యూస్) :** నేరాల నియంత్రణ, ప్రజా భద్రత బలోపేతంలో సీసీటీవీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ తెలిపారు.బుధ వారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించి ప్రజా భద్రత, రోడ్డు భద్రత అవగాహన, మాదకద్రవ్యాల నియంత్రణ, సాంకేతిక ఆధారిత పోలీసింగ్ , ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా పోలీస్ అతిథి గృహంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో డీజీపీ పాల్గొని మొక్కలు నాటారు. ఆ తర్వాత చిల్డ్రన్ పార్క్ ను ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్ ను ప్రారంభించారు.గాంజా, డ్రగ్స్ లాంటి మారకద్రవ్యాలకి బారిన పడిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న అడిక్షన్ సెంటర్ ని సందర్శించారు. అనంతరం ఆదిలాబాద్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమీకృత సీసీటీవీ మానిటరింగ్ వ్యవస్థను డీజీపీ సి.వి. ఆనంద్ ప్రారంభించారు. నాందేడ్, నిర్మల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దుకు అనుసంధానంగా ఉన్న ఆదిలాబాద్ జిల్లా వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని అధికారులు వివరించారు. ఈ ప్రాంతాల మధ్య వాహనాలు, ప్రజల రాకపోకలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్ పర్యవేక్షణ, ప్రమాదాల నివారణ, జిల్లా పోలీసులు చేసిన సీసీటీవీల ఏర్పాటును డీజీపీ అభినందించారు. హైదరాబాద్, సైబరాబాద్ నగరాల మాదిరిగా ఆదిలాబాద్ జిల్లాను కూడా సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా కేంద్రాలతో పాటు చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను విస్తరించాలని అధికారులకు సూచించారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఇటీవల 300 కొత్త సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఆదిలాబాద్ పట్టణంలో మొత్తం కెమెరాల సంఖ్య 600కు చేరిందని తెలిపారు. అలాగే జిల్లా గ్రామాల్లో 1,200కు పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటన్నింటినీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయడం ద్వారా ఘటనలపై తక్షణ స్పందన సాధ్యమవుతుందని వివరించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం లో డీజీపీ మాట్లాడుతూ ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, గంజాయి , ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ, పట్రోలింగ్ వ్యవస్థ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. నేర నియంత్రణలో ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు యాంటీ నార్కోటిక్స్ అండ్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పోలీసు అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతిరోజూ నిర్దిష్ట సమయాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికి కేటాయించాలని ఆదేశించారు. పోలీసు-ప్రజల సంబంధాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.నేరాల దర్యాప్తులో పోలీసు డాగ్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కూడా సూచించారు.గుడిహత్నూర్ మండలంలోని తోష గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. గ్రామసభలో గ్రామ పెద్దలు, సర్పంచ్, వార్డు సభ్యులు, యువతతో కలిసి మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.రోడ్డు భద్రత అనేది అందరి బాధ్యత అని పేర్కొన్న డీజీపీ, ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని అర్హులైన వ్యక్తులకు పోలీసు, రవాణా శాఖల సహకారంతో లైసెన్సులు పొందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన రంగవల్లి పోటీలు, వాలీబాల్ టోర్నమెంట్ల విజేతలకు బహుమతులు అందజేశారు.తెలంగాణ ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద సమస్యను విజయవంతంగా ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు కొత్త సవాళ్లుగా మారాయని డీజీపీ పేర్కొన్నారు.గత ఏడాది తెలంగాణ రాష్ట్రంలో 7,800 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక మరణాలను నివారించవచ్చని తెలిపారు. “వేగం ఉత్సాహాన్ని ఇవ్వొచ్చు, కానీ అదుపు కోల్పోతే ప్రాణాలను తీస్తుంది. ట్రాఫిక్ నిబంధనలను ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదు” అని హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాలు గణనీయంగా తగ్గాయని డీజీపీ కి జిల్లా ఎస్పీ వివరించారు. గత సంవత్సరం జనవరి నుంచి మే వరకు 72 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, ఈ ఏడాది జనవరి - మే చివరి నాటికి సంఖ్య 48కు తగ్గిందన్నారు.అవగాహన కార్యక్రమాలు, పోలీసు, రవాణా శాఖలు, జిల్లా యంత్రాంగం సమిష్టి కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. 24 మంది ప్రాణాలు కాపాడటం అంటే 24 కుటుంబాలను విషాదం నుంచి రక్షించినట్టేనని తెలిపారు.మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు.ఒకప్పుడు వ్యవసాయం, పరిశ్రమలు, దేశ ఆర్థికాభివృద్ధిలో దేశంలో లో నంబర్ 1 స్థానంలో పంజాబ్ రాష్ట్రం డ్రగ్స్ ప్రభావంతో 21 స్థానానికి పడిపోయింది.నేడు పంజాబ్ సామాజికంగా, ఆర్థికంగా సమస్యలను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. తెలంగాణ యువత అలాంటి పరిస్థితులు రాకుండా విద్య, ఉపాధి, ఆవిష్కరణలు, దేశ నిర్మాణం వైపు దృష్టి సారించాలని సూచించారు.రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని డీజీపీ పిలుపునిచ్చారు. జాతీయ రహదారుల వెంట భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌ను అరికట్టేందుకు గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, యాంటీ నార్కోటిక్స్ చర్యలను మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, యువత కలిసి పనిచేసినప్పుడే డ్రగ్స్ రహిత, సురక్షిత, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమని డీజీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో డీజీ సీఐడీ ఉ ఏసీబీ శ్రీమతి చారు సిన్హా, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది, తోష గ్రామ సర్పంచ్ శ్రీమతి పద్మ, గ్రామ పెద్దలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# నకిలీ నంబర్ ప్లేట్ వాడితే జైలుకు పోవడం గ్యారెంటీ

**హైదరాబాద్:** నకిలీ నంబర్ ప్లేట్‌ను వాడటం చట్టవిరుద్ధం. ఇది అందరికి తెలిసిన విషయమే అయినా కొందరు చలాన్ల నుంచి తప్పించుకునేందుకు, నేరాలు చేసినప్పుడు పోలీసులను తప్పుదారి పట్టించేందుకు తన వెహికల్ నెంబర్ మారుస్తుంటారు. గతంలో ఇలా చేస్తే జరిమానా విధించిన పోలీసులు ఇప్పుడు కఠిన చర్యలకు దిగారు. బండికి నకిలీ నెంబర్ ప్లేట్ ఉంటే జైలుకు పోక తప్పదని హెచ్చరిస్తున్నారు. తాజాగా సంగారెడ్డి జిల్లాలో నకిలీ నంబర్ ప్లేట్?ను ఉపయోగించి పోలీసులను ఓ యువకుడు తప్పుదోవ పట్టించాడు. గుర్తించిన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, సంగారెడ్డి టౌన్ పోలీసులు సంయుక్తంగా అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.కేసు వివరాలివే : పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా, హనోరా మండలంలోని దౌలతాబాద్ గ్రామానికి చెందిన పి. అరుణ్ గౌడ్(26) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాఫిక్ ఉల్లంఘనల తాలూకు ఈ చలాన్ జరిమానాల నుంచి తప్పించుకో వాలని అనుకున్నాడు. ఆ



ఉద్దేశంతో తన ద్విచక్ర వాహనానికి టూ12జుఎం 2299 అనే నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌ను ఉపయోగి ంచాడు.అసలు యజమానిపై చలాన్లు : నిందితుడు ఈ నకిలీ నంబర్ ప్లేట్‌ను ఉపయోగించి పలుమార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడ్డాడు. అయితే ఆ నంబర్ ప్లేట్‌ను కలిగి ఉన్న అసలు వాహన యజమాని హైదరాబాద్? నివాసి ఆసిఫ్ ఖాన్. నిందితుడి చర్య వల్ల ఆసిఫ్ ఖాన్ పేరున ట్రాఫిక్ చలాన్లు జనరేట్ అయ్యాయి. దీనిపై ఆసిఫ్ ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన హుజూరాబాద్ ఆర్డీవో



**జూన్ 10. హుజురాబాద్**

హుజూరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్డీవో )బాధ్యతలు స్వీకరించిన నాయక్ వాడి జల కుమారి బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జల కుమారి కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని పరిపాలనా అంశాలు, రెవెన్యూ శాఖ పనితీరు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తదితర విషయాలపై చర్చించారు.హుజూరాబాద్ డివిజన్‌లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం

**- సర్పంచ్ చంద్రకళ మొగిలి**



**టేకుమట్ల, జూన్ 10**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో బుధవారం '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ పెరుమండ్ల చంద్రకళ మొగిలి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్ మాట్లాడుతూ, ప్రజా పాలన కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.సాగునీటి వసతులు, విద్యుత్ సదుపాయాలు,చెరువులు, కాలువల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ చంద్రకళ మొగిలి మాట్లాడుతూ, 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సాధించిన పురోగతిని ప్రజలకు వివరించారు. గ్రామ ప్రజల సహకారంతో వెంకట్రావుపల్లిని అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కుమార్, ఉప సర్పంచ్ చిమినవేణ శ్రీకాంత్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సీవోలు, కారోబార్ తదితరులు పాల్గొన్నారు.

# శిశు సంక్షేమ శాఖలో అవినీతి కలకలం

**- అధికారిణిపై ఏసీబీ కేసు**



**హైదరాబాద్, జూన్ 10** కరీంనగర్ జిల్లా శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్‌పై అవినీతి ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ పథకాల అమలులో అక్రమాలు, నిధుల దుర్వినియోగం, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదులపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.జూన్ 2022 నుంచి ఏప్రిల్ 2024 వరకు రూ.2.37 లక్షల మేర అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు నమోదుకావడంతో ఎస్పీఈ, ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.ఆర్థిక లావాదేవీలు,బ్యాంకు ఖాతాలు, యూపీఐ చెల్లింపులు, ఐసీడీఎస్ నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం.ఈ ఘటన జిల్లాలో కలకలం రేపగా, అవినీతి ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దర్యాప్తు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

గురువారం,
జూన్ 11, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# అక్రమ నిర్మాణానికి ఇంకా అండగా టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్..?

- రంగంలోకి.. రజియుద్దీన్..!











**కుత్బుల్లాపూర్ : జూన్ 10 (పీపుల్స్ న్యూస్)**
గాజుల రామారం ప్రాంతంలో అక్రమ నిర్మాణాలకు కొందరు టౌన్ ప్లానింగ్ సిబ్బంది అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. స్థానికుల కథనం ప్రకారం, గతంలో ఓ అక్రమ నిర్మాణం జరుగుతోందని సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ, అప్పట్లో టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్ రజియుద్దీన్ జోక్యం చేసుకుని సదరు నిర్మాణదారుడికి మద్దతు పలికారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూడా కోల్పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు అనేక షాపులు, ఇళ్ల ముందు ఉన్న ఆక్రమణలను తొలగిస్తూ ముందుకు సాగారు. అయితే బాటా షోరూమ్ సమీపంలోని ప్లాట్ నంబర్ 128 వద్దకు చేరుకున్న తర్వాత పరిస్థితి మారిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఆ ప్లాట్ ముందు ఉన్న ఆక్రమణలను తొలగించాల్సిన సమయంలో మళ్లీ రజియుద్దీన్ రంగంలోకి దిగారని, ఆయన జోక్యంతో ఆ ఇంటి ముందు ఉన్న అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకే ప్రాంతంలో మిగతా వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, కొందరికి మాత్రం మినహాయింపులు ఇవ్వడం వెనుక కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వ భూములు, రహదారుల పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాల్లో అధికారులు పక్షపాతం లేకుండా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. ప్లాట్ నంబర్ 128 వద్ద ఉన్న నిర్మాణాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, రోడ్ విస్తరణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# బిఆర్ఎస్ లో చేరికలు.



**జూన్ 10. హుజురాబాద్**
హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.రాజపల్లి గ్రామ సర్పంచ్ కటుకూరి మల్లారెడ్డి, జూపాక సింగిల్ విండో చైర్మన్ అలుమల్ల శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి ఉప సర్పంచ్ శనిగరం అయిలయ్య, వార్డు సభ్యులు ఈర్ల రాజు (బీజేపీ బూత్ అధ్యక్షుడు), ఈర్ల ప్రవీణ్, మునిగాల పోచయ్య, శనిగరపు సమ్మయ్య, నోముల కరుణాకర్, పత్తి శ్రీనివాస్ రెడ్డి, శనిగరపు రవి, కాంగ్రెస్ పార్టీ బూత్ అధ్యక్షుడు ఎండి రమీజ్, రాజపల్లి సోషల్ మీడియా కాంగ్రెస్ ఇంచార్జ్ చెవుల సాయి కుమార్ తదితరులు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి గ్రామ గ్రామాన విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాడే పార్టీగా బీఆర్ఎస్ నిలుస్తోందని, హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం మరింత శక్తివంతంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాణి సురేందర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత రాష్ట్ర సమితి నాయకుల ప్రత్యేక పూజలు

**హైదరాబాద్: జూన్10,** ఆస్నాద్ గ్రామంలోనీ వీరశీజనేయ స్వామి దేవాలయంలో భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముందుగా గరుత్మంతా సైత ఆంజనేయస్వామిని దర్శించుకుని, ఉద్యమ నేత బాల్క సుమన్ త్వరగా జైలు నుండి విడుదలై, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై మరింత బలంగా పోరాడాలని స్వామివారిని ప్రార్థించడం జరిగింది.అనంతరం భారత రాష్ట్ర సమితి నాయకులు నరసింహ చారి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయం గురించి మాట్లాడితే అక్రమ కేసులు బనాయించి నానా ఇబ్బందులకు గురి చేయడమేనా ఇందిరమ్మ పాలన అనీ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా ఆటవిక పాలన సాగడమే కాకుండా కుట్రపూరితంగా ప్రతిపక్షాలపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఆస్నాద్ గ్రామ,మండల నాయకులు ఇనగంటి వెంకటేశ్వరరావు,మడా మాధవ రెడ్డి,ఏలేశ్వరం నర్సింహ చారి, ఇంగిలి రవి,నస్కురి శ్రీనివాస్, వడ్లకొండ జితేందర్,పంతె దేవేందర్, వడ్లకొండ స్వామి,అయిటిపాముల రవి,ముకుం మల్లన్న,ఎడ్ల పూన్నం కార్యకర్తలు పాల్గొన్నారు.

# అడ్డగుట్టలో అడ్డగోలు నిర్మాణం..!

## Go2 అనుమతులతో Go5 నిర్మాణం..!

### అక్రమ నిర్మాణానికి అండదండలు ఎవరివి..?

**కూకట్ పల్లి : జూన్ 10 (పీపుల్స్ న్యూస్)**
కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని అడ్డగుట్ట సొసైటీ ప్రాంతంలో మరో భారీ అక్రమ నిర్మాణం వెలుగులోకి వచ్చింది. అధికారుల అనుమతులు కేవలం +o2 అంతస్తుల వరకు మాత్రమే ఉండగా, నిర్మాణదారుడు ఏకంగా +o5 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.సొసైటీ సర్వే నంబర్ 177, ఇంటి నంబర్ 2-22-311/టూ/1, కూకట్పల్లి ప్రాంతంలో ఈ నిర్మాణం యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత విభాగాల అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు అధికారులు, నిర్మాణదారుల మధ్య కుమ్మక్కు కారణంగానే ఈ అక్రమ నిర్మాణం నిర్భయంగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఒకవైపు నగరంలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటిస్తుండగా, మరోవైపు అడ్డగుట్టలో జరుగుతున్న ఈ నిర్మాణం వారి మాటలకు భిన్నంగా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణ అనుమతులను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భాగాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాల వల్ల భవిష్యత్తులో భద్రతా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే దానికి బాధ్యత ఎవరు వహిస్తారో అధికారులు స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.




**అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి.**
నగర పరిధిలో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడ్డగుట్ట సొసైటీ లో నిర్మాణదారులు నామమాత్రపు అనుమతులు తీసు కుని, అనుమతులకు మించి అదనపు అంతస్తులను నిర్మిస్తూ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకంగా టిడిఆర్ , ఇతర అభివృద్ధి రుసుములు చెల్లించకుండా తప్పించుకునేందుకు కొంతమంది నిర్మాణదారులు టౌన్ ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోతున్నట్లు తెలుస్తోంది.ఇక నిర్మాణ ప్రదేశాల్లో కార్మికుల భద్రత పూర్తిగా గాలికొదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ కార్మికులకు హెల్మెట్లు, సేఫ్టీ బెల్టులు, రక్షణ వలలు వంటి కనీస భద్రతా పరికరాలు అందించడం లేదని చెబుతున్నారు. ఎలాంటి భద్రతా ప్రమా ణాలు పాటించకుండా పనులు కొనసా గుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయాందో ళనలు వ్యక్తమవుతున్నాయి.అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమా ండ్ చేస్తున్నారు. అలాగే నిర్మాణ కార్మికుల భద్రతకు సంబంధించిన నిబంధ నలను కచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నారు.



# కడిపికొండ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



**హనుమకొండ, జూన్ 10**
హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్.డి. రాంకుమార్ బుధవారం కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.నేచురోపతి డిస్పెన్సరీని సందర్శించిన డీఎంహెచ్‌వో, గర్భిణులు, బీపీ, షుగర్ రోగులకు సులభ వ్యాయామాలు నేర్పించి ఆరోగ్యకర జీవనశైలిని అలవాటు చేయాలని శిక్షకులకు సూచించారు.30 ఏళ్లు పైబడిన 30,721 మందికి స్క్రీనింగ్ నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటివరకు 15,167 మందికి మాత్రమే పరీక్షలు నిర్వహించినట్లు తెలుసుకుని మిగిలిన వారందరికీ పరీక్షలు పూర్తి చేసి ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సిబ్బంది పనితీరును కూడా సమీక్షించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. ప్రదీప్ రెడ్డి, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా. శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ డా. ఇర్ఫాన్,స్థానికవైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమకొండలో కేజీబీవీ సక్సెస్ మీట్ కమ్ అడ్మిషన్ మేళా

**హనుమకొండ, జూన్ 10** హనుమకొండ జిల్లా పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), జడ్పీ, ప్రభుత్వ, మోడల్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల కోసం "కేజీబీవీ సక్సెస్ మీట్ కమ్ అడ్మిషన్ మేళా" కార్యక్రమాన్ని జూన్ 12న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు శాయంపేట కేజీబీవీలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజు గౌడ్ తెలిపారు.కేజీబీవీలలో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత వసతి, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, భద్రతా ఏర్పాట్లు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే కేజీబీవీ పూర్వ విద్యార్థినుల విజయగాథలను విద్యార్థులు, తల్లిదండ్రులకు పరిచయం చేయనున్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కోరారు.

# సీజ్ చేసిన రేషన్ బియ్యం

## మాయం చేసిన పోలీసులు

**- న్యాయం చేయవలసిన పోలీసులే కాజేయడమేంటి..**

**- వివరాలు అడిగిన రిపోర్టర్ ను మీకెందుకంటూన్న కానిస్టేబుల్**



**జిల్లేడు చౌదరిగూడ జూన్ 11 :** సీజ్ చేసిన రేషన్ బియ్యం మాయం చేసిన పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ రవాణాలో పట్టుబడిన ఏ వస్తువైనా పోలీస్ లో పట్టుబడితే తమదైన శైలిలో విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తారు. కానీ ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా కొనసాగింది ఎస్ఓటి పోలీసులు రేషన్ బియ్యాన్ని సీజ్ చేస్తే ఆ రేషన్ బియ్యాన్ని మధ్యలోనే మాయం చేసిన ఓ కానిస్టేబుల్ ఈ ఘటన రంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లేడ్ చౌదర్ గూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల మార్చి 17వ తేదీన ఎస్ఓటి పోలీసులు వేపకుచ్చ తాండాకు చెందిన సంతోష్ నాయక్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బులెరా వాహనంలో పూణేకు తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎస్ఓటి పోలీసులు పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు అక్కడి నుండి సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని షాద్ నగర్ సివిల్ సప్లై గోదాముకు తరలిస్తున్న క్రమంలో రెండు బస్తాలు (క్వింటాల్) బియ్యని ఓ కానిస్టేబుల్ కొందుర్గు మండల కేంద్రంలోని ఓ మెకానిక్ షాపు, దాచి పెట్టి అంటే బియ్యాన్ని ఇంటికి తీసుకు వెళ్లినట్టు షాప్ నిర్వాహకుడు చెప్పుకొచ్చాడు విషయం తెలుసుకోవడానికి ఓ జర్నలిస్టు కానిస్టేబుల్ ప్రహ్లాద్ కు ఫోన్ చేయగా అవును ఆరెండు బియ్యం బస్తాలతో పాటు మరో నాలుగు కూడా మధ్యలోనే దింపమని చెప్పుకొచ్చారు .

**- ధర్మకాంట వద్ద బియ్యం దింపారు. బులేరా డ్రైవర్**

జిల్లేడ్ చౌదర్ గూడ పోలీస్ స్టేషన్ నుంచి బొలెరో వాహనంలో సీజ్ చేసిన రేషన్ బియ్యం బస్తాలను డైరక్ట్ గా గోదాంకు తీసుకపోకుండా షాద్ నగర్ పట్టణంలోని మహబూబ్ నగర్ రోడ్డులో ఓ ధర్మకాంటా దగ్గర తూకం చేయించే ముందు రెండు బియ్యం బస్తాలను (క్వింటాల్) బొలెరో వాహనంలో నుండి దింపి తర్వాత తూకం చేయించారూ కానిస్టేబుల్ ప్రహ్లాద్ మళ్లీ తిరిగి సివిల్ సప్లై గోదాం దగ్గర బియ్యం బస్తాలను గోదాంలో దింపిన తర్వాత రిటర్న్ లో ధర్మకాంట దగ్గరికి వెళ్లి బొలెరా వాహనంలోనే ఆ రెండు బియ్యం బస్తాలను తెచ్చి కొందుర్గులోని ఓ బైక్ మెకానిక్ షాపులో దింపగా అక్కడనుండి సిమెంట్ షాప్ కి తీసుకెళ్లి అక్కడి నుండి కానిస్టేబుల్ ఇంటికి తీసుకెళ్లాడని బైక్ మెకానిక్ షాప్ తో పాటు సిమెంట్ షాప్ నిర్వాహకులు బులేరా డ్రైవర్ చెప్పడం జరిగింది.

**-ఆ రెండిటితో పాటు మరో నాలుగు దింపాం కానిస్టేబుల్**

జరిగిన తతంగంపై కానిస్టేబుల్ ప్రహ్లాద్ ను ఓ జర్నలిస్టు, ఫోన్లో వివరణ కోరగా ఆ రెండు బియ్యం బస్తాలతో పాటు మరో నాలుగు బస్తాలు కూడా మధ్యలోనే దింపడం జరిగింది. రెండు బస్తాల గురించి చెప్పిన వాళ్ళు మిగతా నాలుగు బస్తాల గురించి చెప్పలేదా అంటూ అసలు మీరు ఎందుకు కాల్ చేస్తున్నారు ఆ విషయం గురించి మీకు ఎందుకు అంటూ.. కానిస్టేబుల్ ఇష్టానుసారంగా మాట్లాడినట్టు రిపోర్టర్ తెలిపారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన పట్ల పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు చేస్తున్న ప్రజలు,

## పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- గ్రామసభలో సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్**




**కుల్కచర్ల జూన్ 11 :** వచ్చే వర్షాకాలం దృష్ట్యా గ్రామ ప్రజలందరూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని లాల్ సింగ్ తండా గ్రామపంచాయతీలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభ నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా ప్రత్యేక అధికారి మణికుమార్, పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ.. గ్రామంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని తడి చెత్త పొడి చెత్తను వేరుగా వేయాలని వర్షాకాలంలో కరెంటు స్తంభాలపై ఎవరు ఎక్కకూడదని పలు సూచనలను ఆయన అందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వాటి యొక్క ఉపయోగాలను ప్రత్యేక అధికారి తెలియజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాథోడ్ శ్రీనివాస్ నాయక్, ప్రత్యేక అధికారి మణికుమార్, ఉప సర్పంచ్ లౌడియ బుజ్జి ,పంచాయతీ కార్యదర్శి వరుణ్, మహిళా సంఘాల సిసి వెంకట నర్సింలు ,అధ్యక్షురాలు శాంతమ్మ, వార్డు సభ్యులు శివమ్మ, చెంప్లి బాయ్, నరేష్ ,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆస్మా ,కరెంట్ అధికారి లక్ష్మయ్య, తదితరులు, యువకులు పాల్గొన్నారు.

## పేదల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

**- పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్**

**- అభివృద్ధికి ప్రజలు సహకరించాలి.**

**- 12 వ వార్డు కౌన్సిలర్ వారాల రవీంద్ర**




**పరిగి జూన్ 11 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక, లో భాగంగా నిర్వహించే కార్యక్రమంలో పరిగి పట్టణనన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకునేందుకు సహాయపడుతుందని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ తెలిపారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిగి మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ వారాల రవీంద్ర, ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు సభ, కారిక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ మల్లేష్, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కొరకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుంది. పేదల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం అని ఆమె తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలు కూడా తెలుసుకునేందుకు ఎంతో తోడ్పడుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు వివిధ పార్టీల నాయకులు వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న - సివిల్ సప్లై డైరెక్టర్



**కుల్కచర్ల జూన్ 11 :** రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన సివిల్ సప్లై అధికారి బుధవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం బండవెల్కచర్ల గ్రామ సమీపంలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన సివిల్ సప్లై డైరెక్టర్ శ్యాంప్రసాద్ లాల్, అనంతరం ఆలయ కమిటి చైర్మన్ మహిపాల్ రెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ ను శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ పూజ కార్యక్రమంలో డీఎస్ఓ సుదన్ శ్యామ్, డిఎం మోహన్ కృష్ణ, ఇతర అధికారులు, వికారాబాద్ జిల్లా రైస్ మిల్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, విజయేందర్ రెడ్డి, దేవాలయం అర్చకులు పాండుశర్మ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీదైన జిమ్ పరికరాలు అవసరం లేదు.. ఇంట్లోనే ఇలా సులభంగా కోర్ మజిల్స్‌కు వ్యాయామం చేయవచ్చు..

ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గిపోవడం, ఎక్కువసేపు కూర్చొని పనిచేయడం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాల వల్ల కండరాల బలహీనత, కండరాల క్షీణత సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా వయస్సు పెరిగే కొద్దీ కండరాల పరిమాణం, బలం సహజంగానే తగ్గుముఖం పడతాయి. కండరాలు కేవలం శరీర బలానికే కాకుండా జీవక్రియలు, సమతుల్యత, కదలికలు, మొత్తం ఆరోగ్యానికి కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే కండరాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. కండరాల బలాన్ని నిలబెట్టుకోవడానికి రెసిస్టెన్స్ ట్రైనింగ్ అత్యంత ప్రభావవంతమైన వ్యాయామ పద్ధతిగా మారింది. అయితే ఇందుకోసం తప్పనిసరిగా జిమ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే సాధారణ నీటి బాటిళ్లను డంబెల్స్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించి అనేక వ్యాయామాలు చేయవచ్చు. 500 మిల్లీలీటర్ల నుంచి 2 లీటర్ల వరకు ఉన్న నీటి బాటిళ్లు ప్రారంభస్థాయి వ్యాయామాలకు అనుకూలంగా ఉంటాయి.నీటి బాటిల్స్‌తో డంబెల్స్..అవసరాన్ని బట్టి బాటిల్‌లోని నీటి పరిమాణాన్ని తగ్గించడం లేదా పెంచడం ద్వారా బరువును సర్దుబాటు చేసుకోవచ్చు. చేతుల కండరాలను బలోపేతం చేయడానికి బైసెప్ కర్ల్స్ ను మంచి వ్యాయామంగా భావిస్తారు. ఒక లీటర్ నీటి బాటిల్‌ను చేతిలో పట్టుకుని మోచేతులను శరీరానికి దగ్గరగా ఉంచి నెమ్మదిగా పైకి ఎత్తి కిందికి దించడం ద్వారా ఈ వ్యాయామం చేయవచ్చు. సరైన భంగిమలో చేస్తే చేతుల కండరాల బలం పెరగడంతోపాటు కండరాల ఆకృతి మెరుగుపడుతుంది. భుజాల కండరాలను బలోపేతం చేయడానికి షోల్డర్ ప్రెస్ ఉపయోగపడుతుంది. నీటి బాటిళ్లను చేతుల్లో పట్టుకుని భుజాల స్థాయి నుంచి తలపైకి ఎత్తి మళ్లీ కిందికి తీసుకురావడం ద్వారా ఈ వ్యాయామం చేయవచ్చు. ఇది భుజాలు, చేతులు, పై భాగం కండరాలను బలపరచడంలో సహాయపడుతుంది. రోస్, ఓవర్‌హెడ్ ప్రెస్, లాటరల్ రైజ్ వంటి భిన్న రకాల కదలికలతో ఈ వ్యాయామాన్ని మరింత సమర్థవంతంగా చేయవచ్చు.స్క్వాట్స్ కూడా..స్క్వాట్స్ ను పూర్తి శరీరానికి ప్రయోజనం చేకూర్చే రెసిస్టెన్స్ వ్యాయామంగా గుర్తించారు. ఇది కాళ్లు, పిరుదులు, కోర్ కండరాలను ఒకేసారి పనిచేయిస్తుంది. చేతుల్లో నీటి బాటిళ్లు పట్టుకుని స్క్వాట్స్ చేయడం ద్వారా వ్యాయామం ప్రభావం మరింత పెరుగుతుంది. స్క్వాట్స్ చేసేటప్పుడు మోకాళ్లు పాదాల దిశలోనే ఉండేలా చూసుకోవడం ముఖ్యం. సరైన భంగిమలో చేయడం ద్వారా



సమతుల్యత, కాళ్ల బలం, కోర్ స్థిరత్వం మెరుగుపడతాయి. వెనుక భాగం కండరాలను బలోపేతం చేయడానికి బెంట్–ఓవర్ రోస్ మంచి వ్యాయామం. ఒక చేతిలో నీటి బాటిల్ పట్టుకుని మరో చేయి, మోకాలి సహాయంతో కుర్చీ లేదా బెంచ్‌పై ఆధారపడాలి. తరువాత బాటిల్‌ను నెమ్మదిగా ఛాతీ వైపు లాగి మళ్లీ కిందికి దించాలి. ఈ వ్యాయామం వెన్ను కండరాల బలం పెంచడంతోపాటు శరీర సమతుల్యతను మెరుగుపరుస్తుంది. లంజెస్ కూడా దిగువ భాగం కండరాలను బలపరిచే సమర్థవంతమైన వ్యాయామం. చేతుల్లో నీటి బాటిళ్లు పట్టుకుని ఒక కాలును ముందుకు వేసి మోకాళ్లను వంచడం ద్వారా ఈ వ్యాయామం చేయవచ్చు. ఇది కాళ్ల కండరాలు, నడుము భాగం, శరీర స్థిరత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. లంజెస్ చేసేటప్పుడు వెన్ను నిటారుగా ఉంచడం గాయాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.వారంలో 2, 3 సార్లు చేయాలి..ఈ రెసిస్టెన్స్ వ్యాయామాలను వారానికి రెండు నుంచి మూడు సార్లు చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. శారీరక సామర్థ్యాన్ని బట్టి క్రమంగా వ్యాయామాల సంఖ్య లేదా పునరావృతాలను పెంచుకోవచ్చు. నడక, కార్డియో వ్యాయామాలతో వీటిని కలిపి చేస్తే మరింత ప్రయోజనం ఉంటుంది. అయితే ఒక్కసారిగా అధికంగా వ్యాయామం చేయకుండా క్రమంగా శరీరాన్ని అలవాటు చేయడం అవసరం. కండరాల క్షీణతకు కొన్ని సంకేతాలు కూడా ఉంటాయి. శక్తి తగ్గిపోవడం, తరచూ అలసట అనిపించడం, శరీర నిర్మాణంలో మార్పులు కనిపించడం, రోజువారీ పనులు చేయడంలో ఇబ్బందులు ఎదురవడం వంటి లక్షణాలు కనిపిస్తే కండరాల ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఖరీదైన పరికరాలు లేదా జిమ్ సభ్యత్వం లేకుండానే ఇంట్లో సాధారణ నీటి బాటిళ్ల సహాయంతో రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయడం ద్వారా కండరాల బలాన్ని కాపాడుకోవచ్చు. తీవ్రత కంటే క్రమబద్ధతకు ప్రాధాన్యం ఇస్తూ వ్యాయామాన్ని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవడం దీర్ఘకాలిక కండరాల ఆరోగ్యానికి కీలకమని నిపుణులు సూచిస్తున్నారు.

## వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచి ఎలక్ట్రోలైట్స్‌ను పెంచే ఆరోగ్యకరమైన చట్నీలు ఇవే..!

వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ శరీరంలో నీటి లోపం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత, అలసట వంటి సమస్యలు పెరిగి హీట్ స్ట్రెస్‌కు దారితీస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో శరీరాన్ని లోపల నుంచి చల్లబరచే ఆహారాలు తీసుకోవడం అవసరం. సంప్రదాయ భారతీయ ఆహారాల్లో కెరీ (పచ్చి మామిడి) చట్నీ, పుదీనా చట్నీలను వేసవిలో ప్రత్యేకంగా ఉపయోగపడే పదార్థాలుగా గుర్తించారు. పచ్చి మామిడి చట్నీ శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా చెమట ద్వారా కోల్పోయే లవణాలను భర్తీ చేయడంలో ఇది ఉపయోగకరంగా ఉంటుంది. వేసవిలో నీటి లోపం కారణంగా శరీరం అలసటకు గురికాకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. అంతేకాకుండా జీర్ణక్రియను మెరుగుపరచి ఆకలిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. పచ్చి మామిడిలో ఉండే పులుపు రుచి జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపించి ఆహారం జీర్ణం కావడాన్ని సులభతరం చేస్తుంది. హీట్ స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.పుదీనా చట్నీ..పుదీనా చట్నీని కూడా వేసవిలో శరీరానికి చల్లదనాన్ని అందించే ఆహారంగా పరిగణిస్తారు. ఇందులో ఉండే మెంథాల్ అనే సమ్మేళనం శరీరానికి చల్లదనాన్ని కలిగించే లక్షణాలను కలిగి ఉంటుంది. పుదీనా జీర్ణక్రియను మెరుగుపరచి కడుపు ఉబ్బరం, అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. వేసవిలో అధిక వేడి కారణంగా మందగించే జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో ఇది ఉపయోగకరంగా ఉంటుంది. అదనంగా దీనికి స్వల్ప వాపు నిరోధక లక్షణాలు కూడా ఉంటాయి. పుదీనా చట్నీని పెరుగు, కొత్తిమీర, నిమ్మరసంతో కలిపి తయారుచేస్తే దాని శీతలీకరణ, జీర్ణక్రియకు సంబంధించిన ప్రయోజనాలు మరింత పెరుగుతాయి. ప్రధాన భోజనంతోపాటు చిన్న పరిమాణంలో తీసుకోవడం ద్వారా జీర్ణాశయ సౌకర్యాన్ని కలిగిస్తాయి.హీట్ స్ట్రెస్ నివారణలో..హీట్ స్ట్రెస్ నివారణ విషయంలో పచ్చి మామిడి చట్నీ, పుదీనా చట్నీ రెండింటికీ ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయి. శరీరంలో కోల్పోయిన లవణాలను భర్తీ చేయడం, డీహైడ్రేషన్ ప్రమాదాన్ని తగ్గించడం కోసం పచ్చి మామిడి చట్నీ ఉపయోగపడితే, జీర్ణక్రియ మెరుగుపరచడం, అంతర్గత చల్లదనాన్ని అందించడం కోసం పుదీనా చట్నీ ఉపయోగపడుతుంది. అందువల్ల వేసవిలో ఈ రెండింటినీ పరిమిత మోతాదులో ఆహారంలో చేర్చుకోవచ్చు. అయితే చట్నీల తయారీలో ఉప్పును అధికంగా ఉపయోగించకూడదు. అలాగే ఎప్పుడూ తాజాగా తయారుచేసిన చట్నీలనే తీసుకోవడం మంచిది. ఆమ్లత్వం లేదా గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు మాత్రం పరిమిత మోతాదులో మాత్రమే



తీసుకోవాలి. వేసవిలో హీట్ స్ట్రెస్‌ను తగ్గించేందుకు చట్నీలతోపాటు మజ్జిగ, కొబ్బరి నీరు, పుచ్చకాయ, దోసకాయ, నిమ్మరసం వంటి ఆహారాలు కూడా ఉపయోగకరంగా ఉంటాయి. సరైన ఆహారం, తగినంత ద్రవపదార్థాల వినియోగం ద్వారా వేసవి వేడి ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై 15 వ వార్డులో వార్డు సభ



**ముదిగొండ: జూన్ 10,** :ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై 15 వ వార్డులో కౌన్సిలర్ నకరికంటి రాజేశ్వరి అధ్యక్షతన వార్డుసభ నిర్వహించడం జరిగింది. ఈ సభలో సీనియర్ అసిస్టెంట్ జ్యోతి మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి , శుభ్రత పరిశుభ్రత గురించి, మురుగు నీటిని బయటకు పంపించే విధానం గురించి తెలియపరచడం జరిగింది. వార్డ్ ఆఫీసర్ కే శ్రీనివాసు మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త ను వేరు చేయుట యొక్క ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ రాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన సూచనలను, నియమాలను పాటిస్తూ ప్రజలందరూ జాగ్రత్తగా, ఆరోగ్యవంతంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పి కృష్ణవేణి, ఆశా వర్కర్ ఎండి ముంతాజ్, నాయకులు మల్లెల సత్యనారాయణ, బి నరసింహారావు, వినోద్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అలనాటి దర్శక దిగ్గజం భారతీరాజా కన్నుమూత..! సినీ దిగ్గజం భారతీరాజా (84) ఇక లేరు..!

- అనారోగ్యంతో బుధవారం వేకువజామున ఆయన కన్నుమూశారు.
- గత కొన్ని నెలలుగా ఆయన శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు.
- ఈ క్రమంలో చికిత్స పొందుతూ కన్నుమూసినట్లు బంధువులు తెలిపారు.
- భారతీరాజా మృతితో కోలీవుడ్ లో విషాద ఛాయలు అలుముకున్నాయి.
- ఆయన మృతి పట్ల సినీ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు..!



**చెన్నై : జూలై 11 :** ఇటీవలి కాలంలో ఆరోగ్య సమస్యలతో బాధపడిన భారతీరాజా..తన కుమారుడు మనోజ్ భారతీ రాజా మరణంతో తీవ్ర మనోవేదనకు గుర య్యారు. అయినప్పటికీ సినిమాపై ప్రేమను మాత్రం ఎప్పుడూ కోల్పోలేదు. కెరీర్ చివరి ద శలో పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. తండ్రి, తాత, గ్రామ పెద్ద.. ఇలాంటి పాత్రల్లో ఆయన నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. దర్శకుడిగా ఎంత సహజత్వాన్ని చూపించారో, నటుడిగానూ అంతే సహజమైన అభినయంతో మెప్పించారు.భారతీరాజా మరో గొప్ప సేవ ఏమిటంటే.. కొత్త ప్రతిభను వెలికితీయడం. ఆయన చిత్రాల ద్వారా అనేక మంది నటులు, సాంకేతిక నిపుణులు సినీ రంగానికి పరిచయమయ్యారు.


## సీ ఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు సహాయం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి



**ఎల్బీనగర్ 10 జోన్** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ నందు నివాసం ఉంటున్న మీఱు మెదడుకు సంబంధించి పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో వారి కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ని సంప్రదించారువెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి వారి వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా దరఖాస్తు చేయించారు దీనికి సంబంధించి నాలుగు లక్షల రూపాయల ఎల్.ఓ.సీ లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు కాగా బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారుఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుంది నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతోమంది పేద ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది అని పేర్కొన్నారుబాధిత తండ్రి కాశీనాథ్ గౌడ్ మాట్లాడుతూ మా కుతురు ఆరోగ్య సమస్య విషయంలో సుదీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు

ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు మహేష్ రెడ్డి అనిల్ యాదవ్ అంజయ్య గౌడ్ మధుసూదన్,మనీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రుతుపవనాలు బలహీన పడనున్నాయి




**హైదరాబాద్ : జూన్ 11,** :నైరుతి రుతుపవనాలు బుధవారం దక్షిణ తెలంగాణ - హైదరాబాద్ పరిధిలో నిలిచిపోయే అవకాశం ఉంది మరియు కనీసం జూన్ 17 వరకు ఉత్తర, ఈశాన్య తెలంగాణ వైపు ముందుకు కదిలే అవకాశాలు తక్కువగా ఉన్నాయి రుతుపవనాలు బలహీనపడడం కారణంగా, జూన్ 17 వరకు తెలంగాణలో, ఎండ తీవ్రత పెరగనుంది (అయితే వేడి కారణంగా శక్తివంతమైన ఉరుములు మెరుపులతో కూడిన చెదురు ముదురు వర్షాలు సంభవిస్తాయి).జూన్ 18 తర్వాత బంగాళాఖాతంలో ఒక అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉంది,ఇది జూన్ 19-23 మధ్య తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో చురుకైన రుతుపవన వర్షాలను కురిపిస్తుంది.

## చిన్న బంజారా గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహణ



**గార్ల ::జూన్ 10** :చిన్న బంజారా గ్రామ పంచాయతీలో గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్ బానోతు మోతిలాల్ , వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అధికారులు, గ్రామ ప్రజలు హాజరయ్యారు. గ్రామ అభివృద్ధి పనులు, తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు.గ్రామ ప్రజలు తమ సమస్యలను గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను గ్రామసభ ఆమోదించింది. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.గ్రామసభ గ్రామ పంచాయతీ పాలనలో ముఖ్యమైన వేదికగా పనిచేస్తూ, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు తమ అభిప్రాయాలు వ్యక్తపరచే అవకాశాన్ని కల్పిస్తుంది

# పెళ్లి పీటలపై పెళ్లి కూతురు లీలలు!

- ముహూర్త సమయానికి ప్రియుడితో లబోదిబోమంటూ పెద్దక్క జంప్
- సరేనని చెల్లెలిని కూర్చోబెడితే.. క్లైమాక్స్‌లో బైక్‌పై చిన్నక్క పరార్

**ఉత్తరప్రదేశ్ : జూలై 11,** అది శుభకార్యం జరగాల్సిన కల్యాణ మండపం.. వేదమంత్రాల ఘోషతో, బంధు మిత్రుల కోలాహలంతో కళకళలాడాల్సిన వేదిక. కానీ, అక్కడ సీన్ రివర్స్ అయింది. పెళ్లికొడుకులను కేవలం తోలుబొ మ్మలుగా మారుస్తూ కొంతమంది యువతులు ఆడుతున్న వికృత క్రీడకు ఆ వేదిక సాక్ష్యంగా నిలిచింది. పెళ్లి పీటల మీద వరుడి చేయి వదిలేసి, ప్రియుడి చేయి పట్టుకుని వధువు బైక్‌పై తుర్రుమన్న విచిత్ర, వికృత ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లా అత్తారపూర్‌లో వెలుగుచూసింది.

**- అక్క పారిపోతే.. చెల్లితో పెళ్లికి సై!**

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తారపూర్‌లో ఓ వివాహానికి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. మరికొద్దిసేపట్లో ముహూర్తం అనగా, పెళ్లికూతురు తన ప్రియు డితో కలిసి ఇంట్లోని నగలు, నగదు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా పారిపోయింది. ఈ విషయమై మండపంలో ఇరువ ర్గాల



మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. అవమానంతో కుంగిపోయిన వరుడి తరపు వారిని వధువు తలిదండ్రులు, పెద్దలు బ్రతిమలాడారు. పంచాయితీ అనంతరం, పారిపోయిన అమ్మాయి చెల్లెలిని ఇచ్చి పెళ్లి చేసేందుకు ఒప్పించారు. వరుడు కూడా ఇందుకు అంగీకరించడంతో అంతా ఊపిరి పీల్చు కున్నారు.

**- ట్విస్ట్‌ల మీద ట్విస్ట్..**

కొత్త పెళ్లికూతురు (చెల్లెలు) సర్వాంగ సుందరంగా ముస్తాబై మండపంలోకి అడుగుపెట్టింది. వరుడి పక్కన కూర్చుంది. ఇక జీలకర్ర బెల్లం పెట్టడమే ఆలస్యం అనుకుంటున్న తరుణంలో అసలు క్లైమాక్స్ మొదలైంది. ఒక్కసారిగా మండపం ముందుకు బుల్లెట్ బైక్‌పై ఆమె ప్రియుడు ఎంట్రీ ఇచ్చాడు. అతడిని చూడగానే సీన్ ఒక్కసారిగా మారిపోయింది. పెళ్లిపీటలపై ఉన్న సదరు యువతి.. పక్కనే ఉన్న వరుడి చేతిని ఝటకన వదిలేసి, లేచి పరిగెత్తుకుంటూ వెళ్లి ప్రియుడి చేయి పట్టుకుంది. బంధువులంతా చూస్తుండగానే క్షణాల వ్యవధిలో బైక్ ఎక్కి ఇద్దరూ చెక్కేశారు.

**కర్రలు, రాళ్లతో రణరంగం!**

ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అమ్మాయిలు వరుసగా ఒకే వరుడిని ఇలా నట్టేట ముంచడంతో వరుడి తరపు వారి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అమ్మాయి తరపు వారే ప్లాన్ చేసి తమను పిలిచి మరీ అవమానించారని ఆరోపిస్తూ దాడికి దిగారు. ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో పరస్పరం దాడులు చేసుకోవడంతో కల్యాణ మండపం కాస్తా రణరంగంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి, లాఠీఛార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం ఇరువర్గాలకు సర్దిచెప్పి ఎవరి ఊళ్లకు వాళ్లను పంపించివేశారు.

**- ఫిరోజాబాద్‌లోనూ ఇదే సీన్.. కానీ!**

ఇలాంటిదే మరో సంఘటన ఫిరోజాబాద్ జిల్లాలోనూ చోటుచేసుకుంది. ఇక్కడ కూడా పెళ్లికి ముందే పెళ్లికూతురు ప్రియుడితో కలిసి చెక్కేసింది. అయితే, బరేలీ తరహాలో కాకుండా ఇక్కడ పెద్దలు అప్రమత్తమై, సకాలంలో ఆమె చెల్లెలిని ఒప్పించి వరుడికి ఇచ్చి వివాహం జరిపించడంతో కథ సుఖాంతమైంది. ఏది ఏమైనా.. వరుడి జీవితాలతో, కుటుంబాల గౌరవంతో అమ్మాయిలు ఇలా ఆటలాడుకోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది...

## మల్కాజ్‌గిరిలో కాల్పుల కలకలం.. భార్యను తుపాకీతో కాల్చి చంపిన భర్త అరుణ్

**హైదరాబాద్ జూన్ 10,** :హైదరాబాద్ నగరంలోని మల్కాజ్‌గిరి ప్రాంతంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. భార్యాభర్తల మధ్య నెలకొన్న కుటుంబ వివాదం చివరికి హత్యకు దారి తీసింది. భార్య ఉషారాణిని ఆమె భర్త అరుణ్ తుపాకీతో కాల్చి హతమార్చిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసుల సమాచారం ప్రకారం, అరుణ్ - ఉషారాణి మధ్య గత కొంతకాలంగా వివాదాలు కొనసాగు తు న్నాయి. పలుమార్లు ఘర్షణలు జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో తెల్లవారుజామున "మాట్లాడుకుందాం" అంటూ ఉషారాణిని పిలిపించిన అరుణ్, ముందస్తు ప్రణాళికతో మరో వ్యక్తి సహాయంతో ఆమెపై కాల్పులు జరిపినట్లు ఆరోపణలు




ఉన్నాయి.కాల్పుల ఘటనలో ఉషారాణి అక్కడికక్కడే మృతి చెందగా, నిందితుడు అరుణ్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రాథమిక విచారణలో అరుణ్ గతంలో కూడా తుపాకీతో బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. మూడు నెలల క్రితం అంబర్‌పేట్ ప్రాంతంలో తుపాకీతో హల్‌చల్ చేసిన కేసులో కూడా అతడి పేరు ఉన్నట్లు సమాచారం. అలాగే పాతబస్తీకి చెందిన కొందరి ద్వారా అక్రమంగా తుపాకీ సంపాదించినట్లు అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి.పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేపట్టారు.

## రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

**-2వ వీడత ఇందిరమ్మ ఇండ్లు వెంటనే మంజూరు చేయాలి సిపిఎం**

**గార్ల:: జూన్ 10 :** వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో మార్కెట్లో నకిలీ విత్తనాలను అరికట్టి, రైతులకు సరిపడా ఎరువులు, నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్,మండల కార్యదర్శి అలవాల సత్యవతి లు డిమాండ్ చేశారు. స్థానిక మంగ పతిరావు భవనంలో బుధవారం గడ్డిపాటి రాజారావు అధ్యక్షతన




జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం జూన్ 2వ తేదీన ప్రకటించిన విధంగా అర్హులైన వారికి ఆసరా పెన్షన్లు షరతులు లేకుండా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని నిరుపేదలకు 2వ విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అనేకసార్లు ప్రకటనలు ఇచ్చారని, వెంటనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను ఎలాంటి పైరవీలకు తావు లేకుండా పార్టీ లకు అతీతంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఎం నాయకులు వి.వెంకటేశ్వర్లు,ఏ.వీరస్వామి,ఐ. గోవింద్, యం. నాగమణి,కె. ఈశ్వర్ లింగం, సి. హెచ్. ఎల్లయ్య, బి. ఉపేందర్ రెడ్డి,జె. సత్యం,ఎస్. కె. మౌలానా,డి. కైబాబు,సి హెచ్. బాబు,కె. రామకృష్ణ, తదితరులు ఉన్నారు

## అవగాహన కరపత్రాలు విడుదల చేసినా ఎస్ఐ నరేష్

**కాగజ్నగర్ : జూన్ 11,** :కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండలం ఇస్గమ్ పోలీస్ స్టేషన్ నందు సమాచార హక్కు రక్షణ చట్టం 2005 తెలంగాణ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన కరపత్రాలను ఎస్ఐ నరేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ప్రజలలో, ముఖ్యంగా యువతలో సమగ్ర అవగా హన కల్పించే లక్ష్యంతో సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణ, రోడ్ సేఫ్టీ, ప్లాస్టిక్ నివారణ పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ, భారత రాజ్యాంగ



పీఠిక, సమాచార హక్కు చట్టం పై అవగాహన కరపత్రాలతో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు చట్టాలపై అవగాహనతో వ్యక్తిని బాధ్యతాయుతమైన పౌరుడిగా తీర్చిదిద్దడంలో సహాయప డుతుందని పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వ్యక్తి గత సమాచారం ఎవరికి చెప్పవద్దని, అవగాహన ద్వారానే సైబర్ మోసాలు నివారించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ మండల కమిటీ సభ్యులు గగన్ రాయ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులను అర్థం చేసుకోండి సారూ!

జర్నలిజం అనేది రెండు వైపులా పదును ఉన్న బ్లేడ్ లాంటిది. ఒక వ్యక్తి జర్నలిస్టుగా మారినప్పుడే అన్ని ఆటుపోట్లకు సిద్ధపడి వస్తాడు అని గుర్తుంచుకోవాలి...అధికార పార్టీ కార్యక్రమాలు తోపాటు ప్రతిపక్ష పార్టీ కార్యక్రమాలు ప్రజా సంక్షేమ వార్తలు ప్రచురిస్తూ ప్రజల పక్షంగా ఉండాలి ఇటువంటి సమయంలో అధికార పార్టీకి కొమ్ముకాసి ప్రతిపక్షానికి రాయకుండా ఉంటే రేపు ఆ ప్రతిపక్షం పవర్ లోకి వస్తే ఆ విలేఖరి పరిస్థితి అర్థం చేసుకోవాలి... ఒక విలేకరు అనేవాడు సంస్థకు అడ్వర్టైజ్మెంట్ లు ఇవ్వాలి దానికోసం ప్రతి ఒక్కరికి అనగా పెద్ద, చిన్న అని తేడా లేకుండా ప్రతి వార్త కవర్ చేయాలి వార్త ఇచ్చిన వాడికి ఏమీ అనలేక విలేకరి మీద పడి ఏడ్చే బాపతులు,బెదిరించే వారు ఎక్కువ గా కనిపిస్తున్నారు ఈమధ్య... విలేకరి కోర్సులు నేర్చుకున్నప్పుడు ఏదైనా ప్రూఫ్ ఉంటేనే వీడియో గాని ఆడియో గాని వార్త వేయమని అత్యధిక మెజారిటీతో గెలిచిన పార్టీ




అయినా.... చిత్తుచిత్తుగా ఓడిపోయిన పార్టీ అయినా విలేకరి దృష్టిలో వార్త విషయంలో తేడా ఉండకూడదని వార్త ఎప్పుడు ఏకపక్షం కాకూడదు అని వార్త అనేది ప్రజల పక్షంగా ఉండాలని చెబుతుంటారు. అంతేగాని బయట పరిచయం వేరు, వార్త వేరు పార్టీ ఏదైనా కావచ్చు ప్రతి వార్తలు విలేకరి ధర్మంగా ఉంటూ... అంతేగాని విలేకరీ అనే వాడు ఇటువంటి జీతం లేకుండా స్వచ్ఛందంగా సమాజ సేవ కోసం పనిచేస్తూ ఉంటే వాహన చోదకులే? నుండి కార్యకర్త నుండి నాయకుడు వరకు అందరూ విలువనిస్తుంటే ఒకరిద్దరూ మాత్రం అనవసరంగా హడావుడి చేస్తుంటారు. అలాంటి పక్షంలో ఏమాత్రం ఎలా రాయాలి అని ప్రతి రోజు అలాంటి గొప్ప మేధావులకు?, ఫోన్ చేస్తూ వార్తల రాసుకునేలా రాసిన వార్త సరిచేసి వారు తిరిగి పంపిస్తారేమో విలేకరి పరిస్థితి తయారవుతుందేమో భవిష్యత్తులో.... విలేకరి ఎటువంటి జీతాన్ని ఆశించకుండా వాననకా, ఎండనకా,చలి అని లేకుండా కష్టపడి రాస్తుంటే, పాత పరిచయాలు కారణంగా నోరు పారేసుకోవడం, భయపెట్టడం, దాడి చేయడం ఎంతవరకు సబబు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

## ప్రభుత్వ పథకాల చేరువలో బ్యాంకుల పాత్ర కీలకం

**- కలెక్టరేట్ లో డీసీసీ సమావేశం**

**ఆదిలాబాద్ : జూన్ 11,** :ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనీ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రోజున డీసీసీ సమావేశం నిర్వహించారు. మొదటగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉప్పల్ కుమార్ ధామ్ ఎజెండాను తెలిపారు.మొత్తం డిపాజిట్లు రు.4961.4 కోట్లు మరియు మొత్తం అడ్వాన్సెస్ రు.8069.45 కోట్లుగా చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా బ్యాంకుల వారీగా పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపి, ఎన్ఎల్ఎం, పిఎం విశ్వకర్మ, కామన్ ఇంట్రెస్ట్ గ్రూప్ (సిఐజి) పథకాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కొత్త ఇన్నోవేషన్ ఉన్న లోన్స్ మహిళా స్వయం సంఘాల గ్రూప్ మీద దృష్టి పెట్టాలని కలెక్టర్ గారు వివరించారు. రూఫ్ టాప్ సోలార్ మరియు పి ఎం కుసుం పైన దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్



ఓ ఎఫ్ ఆర్ పట్టాలకు కూడా లోన్ శాంక్షన్ గురించి పర్మిషన్ తీసుకోవాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ఏ. సి. పి (యాన్యువల్ క్రెడిట్ ప్లాన్) 2026 -2027 ను ఆవిష్కరించారు. పెండింగ్లో ఉన్న యూనిట్లకు గల కారణాలు బ్యాంకులవారీగా కలెక్టర్ రాజర్షి షా అడిగి తెలుసుకున్నారు. వెంటనే పెండింగ్లో ఉన్న యూనిట్ల సమస్యలను సత్వరమే పరిష్కరించి, రుణాలు మంజూరు చేయాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ లో కొత్త తరహా లోన్లు ఇవ్వాలన్నారు. మహిళా సంఘాలను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం క్రాప్ లోన్ సీజన్ కావున రైతులను ఇబ్బంది పెట్టకుండా నిబంధనల ప్రకారం డాక్యుమెంట్స్ తీసుకొని సత్వరమే రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు సిబ్బందికి సూచించారు. ఆర్బిఐ ఎల్డిఓ ఎస్ రాములు మాట్లాడుతూ బ్యాంకులో నిరంతరం వినియోగదారుల రక్షణ కొరకు, ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో......

# కమీషన్ దొబ్బుతూనే విమర్శలా..?

## • సునీల్ గవాస్కర్ ఆగ్రహం



ఐపీఎల్ టోర్నీపై విమర్శలు గుప్పిస్తున్న విదేశీ మాజీ క్రికెటర్లు, క్రికెట్ బోర్డులపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీసీఐ నుంచి 10 శాతం కమీషన్ దొబ్బుతూనే టోర్నీపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం తమ ప్రయోజనాల కోసం భారత క్రికెట్‌ను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని ఆయన హితవు పలికారు. ఐపీఎల్ 2026 సీజన్‌లో పూర్తి స్థాయిలో ఆడిన ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్.. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌కు దూరంగా ఉన్నాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ కంటే ఐపీఎల్ వంటి లీగ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ పలువురు మాజీ క్రికెటర్లు ఆర్చర్‌పై విమర్శలు గుప్పించారు. ఐపీఎల్ టోర్నీని తప్పుబట్టారు.ఫ్రాంచైజీ లీగ్స్‌తో అంతర్జాతీయ క్రికెట్‌కు ముప్పు పొంచి ఉందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అన్నాడు. 'టీ20 లీగ్‌లు ఆటగాళ్లకు మంచివే. కానీ అంతర్జాతీయ టెస్టు క్రికెట్ కంటే వీటికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం భవిష్యత్తులో పెద్ద సమస్యగా మారుతుంది'అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ మాజీ ప్లేయర్ సైమన్ డౌల్ సైతం ఆర్చర్ తీరును తప్పుబట్టాడు. డబ్బుల కోసం దేశం తరఫున జరిగే మ్యాచ్‌కు అందుబాటులో లేకపోవడం సరికాదని విమర్శించాడు. గతంలో ట్రెంట్ బౌల్ట్ వంటి ఆటగాళ్లు ఐపీఎల్ సమయాల్లోనూ టెస్ట్‌ల కోసం సిద్ధమయ్యేవారని గుర్తు చేశాడు. ఈ మాజీ ఆటగాళ్ల విమర్శలను సునీల్ గవాస్కర్ ఖండించారు. ఐపీఎల్, భారత క్రికెట్‌ను విమర్శించడం కొందరు విదేశీ ఆటగాళ్లకు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఐపీఎల్‌లో ఆడే విదేశీ ఆటగాళ్లకు ఇచ్చే వేతనంలో 10 శాతం వాటాను బీసీసీఐ నేరుగా ఆయా దేశాల క్రికెట్ బోర్డులకు చెల్లిస్తోందని ఆయన గుర్తు చేశారు.

# వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ప్రతిభావంతుడు

## • సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్. ప్రశంసలు

భారత క్రికెట్ రంగంలో సరికొత్త సంచలనం 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం క్రీడా ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారాడు. ఐపీఎల్ సీజన్ లో దాదాపు 800 పరుగులు సాధించి, టోర్నమెంట్ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో 'ఆరెంజ్ క్యాప్' గెలుచుకున్న ఆటగాడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. అతని అసాధారణ ప్రదర్శన చూసిన సెలక్టర్లు.. ఏరికోరి అతడిని భారత జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. దీని ద్వారా పురుషుల అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే టీమిండియా పిలుపు అందుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ చరిత్ర పుటల్లోకెక్కాడు. కేవలం ఐపీఎల్ మాత్రమే కాదు.. వైభవ్ సూర్యవంశీ వయసు విభాగాల క్రికెట్ లో, దేశీవాళీ (డొమెస్టిక్) సర్క్యూట్ లో, జూనియర్ అంతర్జాతీయ క్రికెట్ లోనూ రికార్డు బద్దలు కొట్టే ప్రదర్శనలతో ఆకట్టుకున్నాడు. ఇటీవల భారత్ సాధించిన అండర్-19 ప్రపంచకప్ విజయంలోనూ అతను కీలక పాత్ర పోషించాడు. పరిమిత ఓవర్ల (లిమిటెడ్ ఓవర్స్) క్రికెట్ లో తన అపారమైన ప్రతిభను ఇప్పటికే నిరూపించుకున్న ఈ యువ సంచలనం..



భవిష్యత్తులో రెడ్-బాల్ (టెస్ట్) క్రికెట్ లో కూడా ఇదే రీతిన రాణించగలడా అసలు అతనికి టెస్ట్ క్రికెట్ ఆడాలనే ఆసక్తి ఉందా అనే ప్రశ్నలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అన్ని ఫార్మాట్లలో అత్యుత్తమ బ్యాటర్‌గా పేరొందిన సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్.. వైభవ్ సూర్యవంశీని "అద్భుతమైన ప్రతిభావంతుడు" అని కొనియాడారు. అయితే అతను టెస్ట్ క్రికెట్ వైపు అడుగులు వేస్తాడా లేదా అనేదానిపై ఆదివారం ఒక ఇంటర్వ్యూలో డివిలియర్స్ తన అభిప్రాయాలను పంచుకున్నారు."అవును, అతను అద్భుతమైన టాలెంట్. కానీ రెడ్-బాల్ క్రికెట్ గురించి నేను కచ్చితంగా సమాధానం చెప్పలేను. అతను అనుకుంటే టెస్ట్ క్రికెట్ ఆడగలడు, కానీ ఇక్కడే పెద్ద ప్రశ్న వస్తుంది.. అతనికి నిజంగానే టెస్ట్ క్రికెట్ ఆడాలని ఉందా దానికి కాలమే సమాధానం చెబుతుంది. అతనికి ఆ సామర్థ్యం, ప్రతిభ ఉన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే టెస్ట్ క్రికెట్ అంత సులువు కాదు, కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. నా అభిప్రాయం ప్రకారం అతను టెస్ట్ క్రికెట్ ఆడాలని నేను కోరుకుంటున్నాను, కానీ ఆడతాడా అనేది అనుమానమే. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూద్దాం" అని డివిలియర్స్ వ్యాఖ్యానించారు. ఇంత చిన్న వయసులోనే వైభవ్‌కు భారత జట్టులో చోటు కల్పించాలనే సెలక్టర్ల నిర్ణయాన్ని డివిలియర్స్ పూర్తిగా సమర్థించారు. "సెలక్టర్లు ఖచ్చితంగా సరైన నిర్ణయం తీసుకున్నారు. ఇంతటి ధైర్యమైన నిర్ణయం తీసుకున్న ందుకు వారికి అభినందనలు. అతను ఇంకా చాలా చిన్నవాడని, అనుభవం లేదని పక్కన పెట్టడం చాలా సులువు. కానీ వైభవ్ తన ప్రతిభతో ఆ తలుపు లు బద్దలు కొట్టాడు. భారత టీ20 జట్టులో స్థానానికి అతను పూర్తి అర్హుడు.

# మైదానంలో తీవ్ర వాగ్వాదం

## • ఇంగ్లిస్‌ను రెచ్చగొట్టిన నహిద్ రాణా

ఢాకా వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్ పేసర్ నహిద్ రాణా, ఆసీస్ కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ మధ్య మైదానంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆసీస్ ఇన్నింగ్స్ 11వ ఓవర్లో ఇంగ్లిస్ (19) వికెట్ తీసిన రాణా, అతని ముందే రెచ్చగొట్టేలా సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. అదే సమయంలో ఏదో అనడంతో ఇంగ్లిస్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. పెవిలియన్‌కు వెళ్తూ వెనక్కి తిరిగి గొడవకు దిగిన ఇంగ్లిస్‌ను బంగ్లాదేశ్ ఆటగాళు సముదాయించి పంపించారు.బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా మధ్య ఢాకా వేదికగా జరిగిన తొలి వన్డేలో ఓ ఆసక్తికర ఘటన జరిగింది. ఈ మ్యాచులో బంగ్లాదేశ్ పేసర్ నహిద్ రాణా , ఆస్ట్రేలియా కెప్టెన్ జోష్ ఇంగ్లిస్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రెండో ఇన్నింగ్స్‌లో జోష్ ఇంగ్లిస్ ఔట్ అయిన తర్వాత వివాదం చెలరేగింది. నహిద్ రాణా సెలబ్రేషన్స్ ఇంగ్లిస్‌కు కోపం తెప్పించాయి. దీంతో మైదానంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు బంగ్లాదేశ్ ప్లేయర్లు సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. 284/8 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఆస్ట్రేలియా తొలి 8 బంతుల్లోనే రెండు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ జోష్ ఇంగ్లిస్.. ఆదుకునే




ప్రయత్నం చేశాడు. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్.. 51/2తో నిలిచింది. అప్పటికే ఇంగ్లిస్ 19 రన్స్ చేశాడు. అయితే 11వ ఓవర్ వేసేందుకు నహిద్ రాణా వచ్చాడు. స్ట్రైకింగ్‌లో ఇంగ్లిస్ ఉన్నాడు. రాణా వేసిన బంతిని షాట్ ఆడబోయిన ఇంగ్లిస్.. వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. బ్యాట్ బంతిని తాకుతూ వెళ్లి వికెట్ కీపర్ చేతిలో పడటంతో ఔట్ అయ్యాడు. దీంతో నహిద్.. సెలబ్రేట్ చేసుకున్నాడు. ఇంగ్లిస్ ముందే తనదైన శైలిలో సంబురాలు చేసుకున్నాడు. ఆ తర్వాత నహిద్.. ఏదో అనగా ఇంగ్లిస్ కోపోద్రిక్తుడైపోయాడు.

# ఒలింపిక్స్‌లో కోహ్లిని ఆడించాలి..

## • టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్

లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ 2028లో విరాట్ కోహ్లిని ఆడించాలని టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ సూచించాడు. విరాట్ కోహ్లి క్లాస్ బ్యాటింగ్‌కు టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసం తోడైతే టీమిండియాకు తిరుగుండదని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు.128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లోకి క్రికెట్ రీఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒలింపిక్ స్వర్ణమే లక్ష్యంగా టీమిండియా సిద్ధమవుతోంది. విశ్వక్రీడల్లో బరిలోకి దిగే భారత క్రికెట్ టీమ్ కూర్పుపై చర్చ మొదలైంది.తాజాగా ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడిన శ్రీశాంత్.. ఒలింపిక్స్ ఆడేలా విరాట్ కోహ్లిని ఒప్పించాలని సెలెక్టర్లకు సూచించాడు. 'మనం ఒలింపిక్ స్వర్ణం గురించి మాట్లాడుకుంటున్నాం. అలాంటి మెగా టోర్నీలో విరాట్ కోహ్లి తప్పకుండా ఆడాలని నేను అభ్యర్థిస్తున్నాను. అతని అపార అనుభవం, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ లాంటి కుర్రాడి దూకుడు కలిస్తే ఆ జట్టు అద్భుతంగా ఉంటుంది. సీనియర్, జూనియర్ ఆటగాళ్ల కలయికతో జట్టును బలోపేతం చేయవచ్చు.విరాట్ కోహ్లికి టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించినా.. ఒలింపిక్స్ ఆడేలా అతన్ని సెలెక్టర్లు ఒప్పించాలి. విరాట్ కోహ్లి ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. ఇది వివాదాస్పదం కావొచ్చు.. కానీ దయచేసి విరాట్‌ను ఒలింపిక్స్ జట్టులోకి తీసుకోండి అని సెలక్టర్లను కోరుతున్నాను'అని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు.ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం అంతర్జాతీయ టీ20లకు విరాట్ కోహ్లి వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన వైభశ్ సూర్యవంశీ.. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసేం దుకు సిద్ధమయ్యాడు.




ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్ అందుకు న్నాడు. అంత ర్జాతీయ క్రికెట్‌లో కూడా వైభవ్ సత్తా చాటితే ఒలింపిక్స్ జట్టులో ఉంటాడు. 1900 సంవత్సరం తర్వాత మళ్లీ ఇప్పుడే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను భాగం చేశారు. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరు జట్ల చొప్పున టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/ సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్‌లను కూడా చేర్చారు.

# గంభీర్‌ను బైపాస్ చేసిన ఆటగాళ్లు!



వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ కోసం టీమ్ఇండియా ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తోంది. భారత్- అఫ్గానిస్థాన్ వన్డే సిరీస్‌తోనే ఈ సన్నాహాలు ప్రారంభం కానున్నాయి. అయితే ఈ లోపే భారత్ జట్టులో సర్దుబాటు చేయాల్సిన సమస్యలు చాలానే ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల భవిష్యత్‌పై చర్చలు జోరుగా నడుస్తున్నాయి. వాళ్లు వచ్చే వన్డే ప్రపంచ కప్ వరకు ఉంటారా లేదా అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. టెస్టులు, టీ20 ఫార్మాట్లలో అత్యంత పట్టున్న వ్యూహకర్తగా గౌతమ్ గంభీర్ పేరుతెచ్చుకున్నాడు. కానీ వన్డే క్రికెట్‌కు సంబంధించి ఆ స్థాయి పట్టు అతడు సంపాదించలేకపోయాడని టాక్. ముఖ్యంగా వన్డే టీమ్‌లోని రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి లాంటి సీనియర్ ఆటగాళ్లతో గంభీర్‌కు సరైన సమన్వయం లేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే జట్టులోని ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు గంభీర్‌ను పక్కన పెట్టి (బైపాస్ చేసి) 2027 వన్డే ప్రపంచకప్ నాటికి తమ భవిష్యత్తు ఎలా ఉంటుందనే విషయంపై స్పష్టత కోసం నేరుగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పెద్దలను ఆశ్రయించినట్లు సమాచారం.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టీ20ల నుంచి రిటైర్ అయినప్పటి నుంచి, వాళ్లిద్దరూ 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడతారా లేదా వారి భవిష్యత్ ప్లాన్స్ ఏంటి అనే అంశాలు తెరపైకి వచ్చాయి. అయితే గౌతమ్ గంభీర్ అనుసరిస్తున్న విధానాలు, అలాగే సెలక్షన్ కమిటీ డిమాండ్లు ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరపున ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ ఆడిన విరాట్ కోహ్లి ఒక విషయాన్ని స్పష్టం చేశాడు. తాను మంచి క్రికెటర్ అని మళ్లీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పాడు. ఇక రోహిత్ శర్మ ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతడు ఇప్పుడు వన్డే వరల్డ్ కప్ విషయంలో భిన్నమైన విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ ప్రముఖ వార్తాపత్రిక నివేదిక ప్రకారం, గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీం మేనేజ్‌మెంట్‌కు, కొందరు సీనియర్ ఆటగాళ్లకు మధ్య పూర్తిస్థాయి అవగాహన కుదరలేదు. ప్రస్తుతానికి ఆ సీనియర్ ఆటగాళ్లు తమ భవిష్యత్తుపై నేరుగా బీసీసీఐ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ పరిణామం అటు కోచ్ గంభీర్‌ను, ఇటు సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్‌ను ఇరకాటంలో పడేసింది. "జట్టులో విరాట్, రోహిత్ లాంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉన్నప్పుడు, డ్రెస్సింగ్ రూమ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు మరింత బలమైన పట్టు ఉండాలి.

# 9 ఏళ్ల తర్వాత లంక గడ్డపై అడుగుపెట్టనున్న టీమిండియా..




భారత క్రికెట్ అభిమానులకు ఒక అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. టీమిండియా సుదీర్ఘ విరామం తర్వాత పొరుగు దేశమైన శ్రీలంకలో టెస్ట్ సిరీస్ ఆడేందుకు సిద్ధమవుతోంది. దాదాపు 9 సంవత్సరాల తర్వాత భారత జట్టు లంక గడ్డపై వైట్ జెర్సీతో బరిలోకి దిగబోతుండటం విశేషం. చివరిసారిగా 2017లో విరాట్ కోహ్లి సారథ్యంలో భారత జట్టు శ్రీలంకలో టెస్ట్ సిరీస్ ఆడింది. అప్పట్లో లంకను వారి సొంత గడ్డపైనే క్లీన్ స్వీప్ చేసి కోహ్లి సేన చరిత్ర సృష్టించింది. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత టీమిండియా అక్కడ అడుగుపెడుతుండటంతో ఈ టూర్ ఫుల్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.ప్రముఖ క్రీడా వెబ్‌సైట్ క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. భారత్, శ్రీలంక మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆగస్టు 15న ఘనంగా ప్రారంభం కానుంది. సరిగ్గా భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున గాల్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా మొదటి టెస్ట్ మ్యాచ్ మొదలవుతుంది. ఈ మ్యాచ్ ఆగస్టు 15 నుంచి 19 వరకు జరుగుతుంది. ఆ తర్వాత కొద్దిరోజుల గ్యాప్‌తో ఆగస్టు 23 నుంచి రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

అయితే, ఈ రెండో మ్యాచ్ జరగబోయే వేదికపై లంక బోర్డు ఇంకా అధికారిక ప్రకటన చేయనప్పటికీ, సెంట్రల్ కొలంబోలోని ప్రసిద్ధ సింహాళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో నిర్వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.శ్రీలంకతో జరగబోయే ఈ రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కేవలం ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కాదు. ఇది ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా జరగబోతోంది. కాబట్టి ఫైనల్ రేసులో నిలవాలంటే రెండు జట్లకూ ఈ సిరీస్ అత్యంత కీలకం కానుంది. ఇప్పటివరకు శ్రీలంక క్రికెట్ బోర్డు కానీ, భారత క్రికెట్ నియంత్రణ మండలి కానీ ఈ షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించలేదు. కానీ అంతర్గత సమాచారం ప్రకారం ఈ తేదీలు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ ఈ సిరీస్ ఆడబోతుండటం గమనార్హం.

ఈ పర్యటనలో కేవలం టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే కాకుండా, అభిమానులను అలరించడానికి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా కూడా హింట్ ఇచ్చారు. లంక బోర్డు నుంచి అదనంగా మూడు టీ20 మ్యాచ్‌లు ఆడాల్సిందిగా తమకు అభ్యర్థన వచ్చిందని ఆయన మీడియాకు వెల్లడించారు. దీనిపై బీసీసీఐ సానుకూలంగానే ఉందని, త్వరలోనే మ్యాచ్‌ల తేదీలు, వేదికలతో కూడిన పూర్తి అధికారిక షెడ్యూల్‌ను ఇరు దేశాల బోర్డులు సంయుక్తంగా విడుదల చేస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# ప్రకృతి ప్రేమికుడు భారతీరాజా

## పల్లె అందాలకు చిత్రాల్లో పెద్దపీట



ప్రకృతిని ప్రేమించడం.. అనుభవించడం.. ఆస్వాదించడం..ఆనందించడం అందరికీ తెలుసు. కాని ఈప్రకృతి రమణీయకతను సెల్యూలాయిడ్‌పై చూపి ప్రేక్షకులను రంజిపం చేయడం కొందరికే తెలుసు. అందులో ముందుంటారు దర్శకలు భారతీరాజా. ఆయన తీసిన చిత్రలే అందుకు నిదర్శనం. భారతీయ సినీ ప్రపంచంలో గ్రామిణ జీవితానికి కొత్త భాషను నేర్పిన దర్శకుడు ఆయన పల్లె అందం, అక్కడి మనుషుల స్వచ్ఛమైన ప్రేమ, వారి అనుబంధాలు – ఆనందాలు, బాధలు – భావోద్వేగాలను ఎంతో సహజంగా వెండితెరపై ఆవిష్కరించడంలో ఆయన తరవాతే ఎవరైనా. ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా మట్టివాసనతో నిండిన ఓ జీవనరాగంలా అనిపిస్తుంది. ప్రేమను కవిత్వంగా, బంధాలను హృద్యంగా, ప్రకృతిని పాత్రగా మలిచిన ఆయన చిత్రాలు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. భావోద్వేగాలకు దృశ్యరూపమిచ్చిన ఓ గొప్ప కథకుడుగా ఆయన చిత్రసీమలో నిలిచి పోయారు. భారతీరాజా భౌతికంగా దూరమయినా, ఆయన తీసిన మణిపూసల్లాంటి చిత్రాలు నిరంతరం మన మనసులను తడుతూనే ఉంటాయి. కన్నడ దర్శకుడు పుట్టణ్ణ కనగల్, పి.పుల్లయ్య వంటి దిగ్గజాల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసి సినిమాలో మెళకువలు నేర్చుకున్నారు. అలా ఆయన పరిశ్రమలోకి అడుగుపెట్టారు.భారతీరాజా తన సినిమాల్లో ఎక్కువగా పల్లెటూరి కథలనే చూపించేవారు. మట్టివాసనను వెండితెర పైకి తెచ్చిన దర్శకుడిగా ఆయనకు పేరుంది. హీరోయిన్లను మేకప్ లేకుండా స్వచ్ఛంగా చూపించేవారు. దీని వెనుక కారణాన్ని ఆయన ఓ సందర్భంలో తనదైన చతురతను జోడించి చెప్పారు. 'ప్రకృతికాంత' అందానికి ముగ్ధుడినయ్యా. అందుకే కెమెరా పట్టుకుని ఆ అందాన్ని వెతుక్కుంటూ అంటూ పల్లెలపై తన ప్రేమను వ్యక్తపర్చారు. 1977లో వచ్చిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు' పేరుతో రీమేక్ అయ్యింది) సినిమాతో భారతీరాజా దర్శకుడిగా పరిచయమయ్యారు. అప్పటివరకు కేవలం స్టూడియో సెట్టింగులకే పరిమితమైన తమిళ సినిమాను నిజమైన పల్లెటూరి లొకేషన్లలోకి తీసుకెళ్లి సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. ఎలాంటి మేకప్ లేకుండా హీరోలను చూపించడం, ఎలాంటి అదనపు సొగసుల జోలికి వెళ్లకుండా సహజంగా ఉన్న అమ్మాయిలను హీరోయిన్లుగా పరిచయం చేయడంతో అప్పటి సినీ సంప్రదాయాలను తిరగరాశారు. కేవలం గ్రామిణ చిత్రాలకే పరిమితం కాకుండా, 'సిగప్పు రోజాక్కల్' (తెలుగులో ఎర్ర గులాబీలు) వంటి సైకో థ్రిల్లర్ చిత్రాలతో తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. తెలుగులో ఆయన దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' (1981) చిత్రం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన తీసిన 'వేదం పుదిదు' సినిమా సమాజంలో పెద్ద చర్చకు దారితీసింది. రాధిక, రాధ, రేవతి, కార్తీక్, విజయశాంతి వంటి ఎందరో నటీనటులను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. భారతీరాజా ప్రతిభకు



ఎన్నో అవార్డులు దాసోహమన్నాయి. ఆయన తన కెరీర్‌లో దాదాపు 40 చిత్రాలకు దర్శకత్వం వహించి, 'ఇయక్కునార్ ఇమయం (దర్శక శిఖరం)' అనే బిరుదును పొందారు. జాతీయ అవార్డులు: వివిధ విభాగాల్లో మొత్తంగా 6 జాతీయ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. ఇందులో తెలుగు చిత్రం 'సీతాకోకచిలుక'కు ఉత్తమ ప్రాంతీయ చిత్ర అవార్డు కూడా ఉంది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ 2004లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. వీటితో పాటు 4 ఫిలింఫేర్ అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర అవార్డులు, నంది అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. ఆయన కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా నటుడిగానూ అలరించారు. 'ఆయుధ ఎళుతు', 'పాండియనాడు', 'తిరుచిత్రంబలమ్' (తిరు), గతేడాది వచ్చిన విజయ్ సేతుపతి 'మహారాజా' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మెప్పించారు. మోహన్‌లాల్ 'తుడరుమ్'లో చివరిసారి తెరపై కనిపించారు. అలాగే ఆయన నటించిన 'పులవర్' చిత్రం ఇంకా విడుదల కావాల్సిఉంది. భారతీరాజా తర్వాతితరం చిత్రనిర్మాతలకు శిక్షణ ఇవ్వడానికి 'భారతీరాజా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సినిమా'ని స్థాపించారు.

## దిగ్గజ దర్శకుడికి అధికారిక వీడ్కోలు..

### తమిళనాడు ప్రభుత్వ కీలక నిర్ణయం



దిగ్గజ చలనచిత్ర దర్శకుడు భారతీరాజా అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రకటించారు. తమిళ చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన అసమాన సేవలకు, ఆయన స్థాయికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. భారతీరాజాకు అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలకాలంటూ తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టీఎఫ్ఏపీఏ) చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

అంతకుముందు టీఎఫ్ఏపీఏ ముఖ్యమంత్రికి ఒక విజ్ఞప్తి చేస్తూ, తమ వ్యవస్థాపకుడైన భారతీరాజాకు ప్రభుత్వ గౌరవం కల్పించాలని కోరింది. దీనిపై వెంటనే స్పందించిన సీఎం విజయ్, ప్రభుత్వ గౌరవ వందనంతో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం పట్ల నిర్మాతల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

ఈ సందర్భంగా టీఎఫ్ఏపీఏ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. భారతీయ చలనచిత్ర రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు భారతీరాజా అని కొనియాడింది. ఒక దర్శకుడిగా ఎన్నో అద్భుతమైన చిత్రాలను రూపొందించడమే కాకుండా, నటుడిగానూ తనదైన ముద్ర వేసి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని ప్రశంసించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ (2004) పురస్కారంతో పాటు 6 జాతీయ చలనచిత్ర అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులు అందుకొని సినిమాకు గర్వకారణంగా నిలిచారని గుర్తుచేసింది.

2020లో నిర్మాతల సంక్షేమం కోసం భారతీరాజా ముందుండి 'తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్'ను స్థాపించారని, ఆయన నాయకత్వ పటిమతోనే ఈ సంఘం నేడు 400 మందికి పైగా క్రియాశీల నిర్మాతలతో బలంగా ఉందని అసోసియేషన్ తెలిపింది. నిర్మాతలు, దర్శకులు, నటీనటుల సంక్షేమం కోసం ఆయన నిరంతరం తపించారని, తమిళ సినిమా అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంది.

## దసరాకు షిఫ్ట్ అయిన టాక్సిక్ విడుదల

### చిత్ర వర్గాల్లో బలమైన టాక్



కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో హుమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార కనిపించనున్నారని సమాచారం. భారీ తారాగణం, హై బ్జడెట్ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా మొదటి నుంచే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ చిత్రం ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, మేకర్స్ సరైన సమయాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిస్థితులు, ఇతర పెద్ద సినిమాల విడుదలలు, పాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదలను వాయిదా వేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సమాచారం ప్రకారం 'టాక్సిక్' సినిమా ఈ ఏడాది అక్టోబర్ నెలకు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయట. ముఖ్యంగా అక్టోబర్ తొలి వారం లేదా మూడో వారంలో విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు కన్నడ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి రిలీజ్ డేట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది.

## తండ్రికి తగ్గ తనయుడిగా బాలకృష్ణ

### బాలకృష్ణ జన్మదినోత్సవం


### అభినందనలు తెలిపిన ప్రముఖులు



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నటసింహం నందమూరి బాలకృష్ణ నటప్రస్థానం ఒక అద్భుతం. ఆయన జన్మదినం సందర్భంగా చిత్ర ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగుతున్న బాలయ్య కెరీర్‌లో ఎన్నెన్నో అపూర్వ విజయాలు, మరెవరికీ సాధ్యంకాని రికార్డులు. వసూళ్ల పరంగానే కాదు, థియేటర్లలో అత్యధిక రోజులు ప్రదర్శించబడిన సినిమా కూడా బాలయ్య పేరుతోనే ఉంది. బాలకృష్ణ పని అయిపోయింది అని విమర్శకులు భావించిన ప్రతిసారీ మాస్ కంబ్యాక్ ఇవ్వడమే కాదు బాక్స్ ఆఫీస్ వద్ద సరికొత్త రికార్డులతో విమర్శకుల నోళ్లు మూయించాడు. మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు ఐదవ కుమారుడిగా 1960 జూన్ 10న బాలకృష్ణ జన్మించారు. తండ్రి నేర్పిన అపారమైన వృత్తి నిబద్ధత, క్రమశిక్షణ, తల్లి బసవరామతారకం అందించిన ప్రేమానురాగాలు బాలయ్యను ఒక విలక్షణమైన వ్యక్తిగా తీర్చిదిద్దాయి. ఓవైపు బడిలో పాఠాలు చదువుకుంటూనే 1974లో ఎన్టీఆర్ నటించిన తాతమ్మకల సినిమా ద్వారా వెండితెరకు పరిచయం అయ్యాడు బాలయ్య. అన్నదమ్ముల అనుబంధం, వేములవాడ భీమకవి, దానవీరశూరకర్ణ, శ్రీమద్విరాటపర్వము, శ్రీతిరుపతి వేంకటేశ్వర కళ్యాణం, రౌడీరాముడు–కొంటె కృష్ణుడు, అనురాగదేవత, సింహం నవ్వింది, శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర' వంటి చిత్రాలలో తండ్రి ఎన్టీఆర్ తో కలిసి నటించి మెప్పించాడు బాలయ్య. 1984లో సాహసమే జీవితం సినిమాతో సోలో హీరోగా మారారు. కానీ ఆ సినిమా ఆశించినంతగా ఆడలేదు. తొలిమూడు సినిమాలు ఫ్లాప్ అవడంతో బాలయ్యపై విమర్శలు వచ్చాయి.

## కలెక్షన్లలో దూసుకెళుతున్న పెద్ది

### రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను అందుకుంటున్న ఈ చిత్రం వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సంచలనం సృష్టించింది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో క్రీడలు, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, పోరాట స్ఫూర్తి వంటి అంశాలను దర్శకుడు బుచ్చిబాబు సాన ఆకట్టుకునే విధంగా చూపించారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటించగా, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'పెద్ది' చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.218.50 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సినిమా పూర్తిస్థాయి విజయాన్ని నమోదు చేయాలంటే దాదాపు రూ.220 కోట్ల షేర్ వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే గ్రాస్ పరంగా రూ.440 కోట్ల మార్క్‌ను అందుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు రూ.332 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించిన నేపథ్యంలో బ్రేక్ ఈవెన్ చేరుకోవడానికి మరో రూ.108 కోట్ల గ్రాస్ అవసరమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 'పెద్ది' ఇప్పటికే బ్రేక్ ఈవెన్ సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

## ఆల్ఫా టీజర్ విడుదల

### భారీ యాక్షన్ సీన్లఓ కొత్తగా ఆలియా భట్

యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ సినిమా 'ఆల్ఫా' టీజర్ బుధవారం విడుదలైంది. శివ్ రావల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో అలియా భట్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించింది. ఈ టీజర్‌లో అలియా భట్ ఒక ట్రైన్డ్ కిల్లర్‌గా శత్రువులపై విరుచుకుపడుతూ కనిపించగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఆమెకు తండ్రిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అలియా భట్ కేవలం ఒక సాధారణ అమ్మాయిలా కాకుండా, చిన్నప్పటి నుంచే పోరాటాల మధ్య పెరిగిన ఒక ప్రమాదకరమైన హంతకురాలిగా కనిపించబోతుంది. భారీ యాక్షన్ సీన్లు, గన్‌÷ట్లు, ÷టింగ్‌లతో ఆమె అదరగొట్టింది. ఈ టీజర్ సినిమాలోని యాక్షన్‌ను చూపించడమే కాకుండా, అలియా భట్, బాబీ డియోల్ పాత్రల మధ్య ఉండే బలమైన బంధాన్ని కూడా చూపిస్తోంది.మరోవైపు ఈ సినిమాలో మరో హీరోయిన్ శర్వరి కూడా నటిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె పాత్రకు సంబంధించిన వివరాలను చిత్ర బృందం ప్రకటించనుంది. బాలీవుడ్‌లో ఇద్దరు హీరోయిన్లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న అరుదైన భారీ యాక్షన్ సినిమా ఇది. యాక్షన్, సెంటిమెంట్, సస్పెన్స్, కామెడీ కలబోతగా వస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్ కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ మూవీ 2026, జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com